ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739

# తెలుగోడు

EENAATI TELUGODU... Telugu Daily https://www.eenaatitelugodu.com

సంపుటి-1 | సంచిక - 44 | బుధవారం 12 నవంబర్ 2025 | పేజీలు - 8 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

సంజన లైఫ్‌కేర్ ఫార్మసీ +




మా వద్ద అన్ని రకాల ప్రముఖ కంపెనీల మందులు లభించును..
ఎమ్మార్పీ ధరలకంటే ప్రతి మెడిసిన్‌పై 10శాతం నుండి 30శాతం వరకు ధర తగ్గించి అమ్మబడును..
అత్యవసర పరిస్థితిలో డోర్ డెలివరీ కూడా ఇవ్వబడును...

బస్టాండ్ సర్కిల్, మెయిన్‌రోడ్, నల్లమాడ.. శ్రీ సత్యసాయి జిల్లా..
సెల్ - 8886920715



# మంచి ఆలోచనలతోనే అవకాశాలు

**ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేస్తా.......**
**లక్షమంది మహిళలను వ్యస్థాపకులుగా తీర్చిదిద్దుతా....**
**ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించిన సిఎం చంద్రబాబు....**






2లో

**ఒంగోలు, నవంబర్ 11 :**

మంచి ఆలోచనలతో ముందుకొచ్చి మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సిఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. ఇంటికో పారిశ్రామికవేత్త ఉండాలనేది తమ లక్ష్యమని ఏపీ సీఎం అన్నారు. చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుతో యువతకు అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. అలాగే చిన్నతరహార పరిశ్రమలు పెట్టేందుకు వచ్చే వారిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. స్థానికంగా ఉన్న అవకాశాలు వినియోగించుకుని యువత ముందుకు రావాలన్నారు. ఈ క్రమంలో మహిళలు కూడా అవాకాశాలను అంది పుచ్చుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించే బాధ్యత తనదని పేర్కొన్నారు. ఈ ఏడాది లక్ష మంది మహిళలను వ్యవస్థాపకులుగాతీర్చిదిద్దుతామన్నారు. వినూత్న ఆలోచనలతో కొత్త పరికరాలను విద్యార్థులు

# ఉగ్రమూకల్ని వదలం

- బాంబు దాడి నిందితులను కఠినంగా శిక్షిస్తాం...
- భూటాన్ పర్యటనలో ప్రధాని మోడీ హెచ్చరిక...
- బాధాతప్త హృదయంతో ఇక్కడికి వచ్చానని వెల్లడి...



**న్యూ ఢిల్లీ, నవంబర్ 11 :**

దిల్లీలోని ఎర్రకోట వద్ద బాంబు దాడికి పాల్పడిన నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. దేశంలోని పలు దర్యాప్తు సంస్థలు ఈ ఘటనపై దర్యాప్తును ముమ్మరం చేశాయని.. దాడికి గల కారణాలను దర్యాప్తు సంస్థల అధికారులు త్వరలో వెల్లడించ నున్నారని తెలిపారు. అమాయకుల ప్రాణాలు తీసిన వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వద లబోమని దేశ ప్రజలకు హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పేలుడులో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు (మిగతా 2లో)

# పేలుడుపై దర్యాప్తు

**నిందితులను కఠినంగా శిక్షస్తాం**
**దర్యాప్తు సంస్థలు వేగంగా పనిచేస్తున్నాయి**
**కేంద్ర రక్షనమంత్రి రాజ్‌నాత్ సింగ్ వెల్లడి**



**న్యూ ఢిల్లీ, నవంబర్ 11 :**

ఢిల్లీలోని ఎర్రకోట కారు పేలుడు ఘటనపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. పేలుడు ఘటనపై భద్రతా, దర్యాప్తు సంస్థలు సమగ్ర విచారణ చేస్తున్నాయని, నిందితులను (మిగతా 2లో)

అశ్రునయనాల మధ్య

# అందెశ్రీ అంత్యక్రియలు

**పాడెమోసి ప్రేమ చాటుకున్న సిఎం రేవంత్..**
**హాజరైన పలువురు నేతలు, మంత్రులు..కళకారులు..**
**పోలీసుల గౌరవ వందనం మధ్య అంత్యక్రియలు పూర్తి...**
**ఆయన పేరు శాశ్వతంగా నిలిచేలా ప్రయత్నిస్తా...**
**పద్మశ్రీ కోసం గతంలోనే కేంద్రానికి లేఖ రాసా ...**
**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి...**




**హైదరాబాద్, నవంబర్ 11 :**

అశ్రు నయనాల మధ్య ప్రకృతి కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలు ముగిశాయి. ప్రభుత్వ అధికారిక లాంఛనాల నడుమ ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు మూడుసార్లు గాలిలోకి కాల్పులు జరిపిన తర్వాత అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం అందెశ్రీ అంతిమ యాత్ర ప్రారంభమైంది. అంతకుముందు లాలాపేటలోని అందెశ్రీ నివాసం నుంచితార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్ వరకు అంతి మయాత్ర నిర్వహించారు. అంతమయాత్రలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, (మిగతా 2లో)

# 12 కు చేరిన మృతుల సంఖ్య

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో ముగ్గురు మృతి...
- సిసి టీవి దృశ్యాల ఆధారంగా కారు గుర్తింపు...
- తీవ్ర గాయాలతో 17మంది ఆసుపత్రిలో చికిత్స...
- కారు నడుపుతున్న వ్యక్తి డా..ఉమర్ మహ్మద్‌గా అనుమానం...
- ఉమర్ కుటుంబీకులతో పాటు 6 మంది అరెస్టు...
- ఢిల్లీ పేలుడు ఘటనలో ముమ్మర దర్యాప్తు....



**న్యూ ఢిల్లీ, నవంబర్ 11 :**

ఢిల్లీ నగరాన్ని కుదిపేసిన ఎర్రకోట పేలుడు ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగింది. సోమవారం సాయంత్రం ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద జరిగిన ఈ భయానక పేలుడులో తొలుత 9 మంది అక్కడికక్కడే మృతి చెందగా, చికిత్స పొందుతున్న వారిలో మరో ముగ్గురు ఆసుపత్రిలో ప్రాణాలు కోల్పోయారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 12కు చేరింది. ప్రస్తుతం తీవ్ర గాయాలతో 17 మంది లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.ఎర్రకోటకు అతి సమీపంలో కారులో సంభవించిన భారీ పేలుడుతో దేశ రాజధాని నగరం దిల్లీ ఉలిక్కిపడింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 12 మంది చనిపోయారు. అనేక మంది గాయపడ్డారు. పలువురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం దర్యాప్తు సంస్థలు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఇక నిందితుడికి సంబంధించిన వీడియోలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ పేలుడుకు (మిగతా 2లో)

# జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్‌దే హవా

అన్ని ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్‌కే అనుకూలం



2లో

# బీహార్‌లో ఎన్డీఏకే పట్టం

మరోమారు నితీశ్‌కు బీహారీల ఓటు



# పదవులు భర్తీ

**పార్టీ పదవులను త్వరలో భర్తీ చేస్తాం..**
**ప్రతిపక్షంలో వున్న స్ఫూర్తితోనే సాగాలి..**
**జిల్లా కోఆర్డినేటర్లతో మంత్రి లోకేష్..**



**అమరావతి, నవంబర్ 11 :**

పెండింగ్‌లో ఉన్న అన్ని పార్టీ పోస్టులు త్వరితగతిన భర్తీ చేస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. అన్ని జిల్లాల్లో పార్లమెంటరీ పార్టీ కార్యాలయాలు, నియోజకవర్గ స్థాయిలో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు స్థలాలు గుర్తించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జోనల్ కోఆర్డినేటర్లతో మంగళవారం మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు (మిగతా 2లో)

# భారీ భద్రత

**విశాఖ సిఐఐ సదస్సులో భారీ భద్రత**
**అధికారులతో సమీక్షించిన హోంమంత్రి అనిత**



**అమరావతి, నవంబర్ 11 :**

విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు-2025 దృష్ట్యా ప్రత్యేక దృష్టి సారించారు. ప్రపంచ దేశాల నుంచి అనేకమంది పారిశ్రామిక వేత్తలు, విఐపిలు రానుండడంతో భద్రతపై చర్యలు తీసుకుంటున్నారు. విశాఖలో అణవ ణువు గాలించి ప్రత్యేక చర్యలకు ఉపక్రమిం చాలరు. ఈక్రమంలో పోలీసు ఉన్నతాధి కారులతో హోం మంత్రి అనిత సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా ఫైర్ సేఫ్టీ అధి కారులకు పలు సూచనలు చేశారు. ప్రముఖు లు, ప్రతినిధులు ఉండే హోటళ్ల వద్ద భద్రతపై దృష్టి పెట్టాలన్నారు. విశాఖ నగరం డ్రోన్, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటుందని, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. శాఖల మధ్య సమన్వ యానికి వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేయాల న్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్కే బీచ్, తెన్నేటి పార్కు, రుషికొండ తీరాల్లో గజఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు ముందుగా తెలియజేయాలని సూచించారు.

# శాంతి..ప్రేమను చాటుదాం

**కన్నుల పండువలా శ్రీ సత్యసాయి జన్మదిన వేడుకలు జరగాలి... రాష్ట్ర మంత్రులు**
**భక్తాదులకు లోటు కలగకుండా ఏర్పాట్లు... లక్షలమందికి గుర్తుండిపోవాలి.. ఎమ్మెల్యే**
**ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, ఎస్పీలు పవర్‌ప్లాంట్ ప్రజెంటేషన్..**

**పుట్టపర్తి, నవంబర్ 11 :**

భగవాన్ శ్రీసత్యసాయి శత జయతి వేడుకల్లో శాంతి, ప్రేమను చాటుతూ లక్షలాది మంది భక్తాదులకు గుర్తుండిపోయే విధంగా కన్నుల పండువలా నిర్వహిద్దామని మంత్రుల బృందం పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రుల బృందం... రాష్ట్ర రెవెన్యూ, జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖ మాత్యులు పయ్యావుల కేశవ్ రాష్ట్ర వైద్యారోగ్యశాఖమాత్యులు సత్య కుమార్ యాదవ్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మాత్యులు సవితమ్మ, దేవాదాయశాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి లు మంగళవారం స్థానిక సాయి ఆరామంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా అధికారులు, శ్రీ సత్య సాయి ట్రస్ట్ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన సన్నాహాలు, భద్రతా ఏర్పాట్లు, వసతి, రవాణా, వైద్య సేవలు, ప్రజా సౌకర్యాలపై విస్తృతంగా చర్చించారు.ముందుగా జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్... శతజయంతి ఉత్సవాలకు సంబంధించి పుట్టపర్తిలో చేపట్టిన పనుల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రులకు వివరించారు. వివిఐపి, వీఐపీల రాక సందర్భంగా ఎయిర్పోర్టు, హెలిపాడ్ల ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల



పార్కింగ్, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటులు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, డస్ట్ బిన్ల ఏర్పాటు, బారికేడింగ్, భక్తులకు త్రాగునీటి వసతి, భోజన వసతి, ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, పవర్ సప్లై, రహదారుల ఏర్పాటు, మెడికల్ క్యాంప్స్, డ్వాక్రా బజార్ ఏర్పాటు తదితరాలపై సమగ్రంగా వివరించారు. చిత్రావతి రివర్ ను చాలా వరకు సుందరీకరణ చేశామని, ఇంకనూ అక్కడ రోడ్డు వర్క్ జరుగుతోందని అది బుధవారానికి పూర్తవుతుందని వివరించారు. త్రాగునీరు, భోజన వసతి నిరంతర విద్యుత్ సరఫరా, తాత్కాలిక మరుగు దొడ్లు వంటి ఏర్పాట్లు, పారిశుద్ధం (మిగతా 2లో)

# ఆంధ్రాను ఆదుకోండి

- మొంథా తుపాన్ నష్టం నుంచి గట్టెక్కించండి...
- ఆంధ్రప్రదేశ్‌కి అదనపు నిధులు కేటాయించండి...
- కేంద్ర మంత్రి చౌహాన్‌కు చంద్రబాబు వినతి....
- గంటపాటు ఇరువురు నేతల చర్చలు....



**అమరావతి, నవంబర్ 11 :**

ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, పీడీఎంసీ స్కీం కింద ఆంధ్రప్రదేశ్‌కి అదనపు నిధులు కేటాయించాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. మంగళవారం అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబుతో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా దాదాపు గంట పాటు వీరి సమావేశమైయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయం, మైనర్ ఇరిగేషన్ తదితర అంశాలపై వీరిరువురు చర్చించారు. మొంథా తుపాన్ వల్ల జరిగిన నష్టాన్నికేంద్ర మంత్రి చౌహన్‌కు సీఎం చంద్రబాబు వివరించారు. ఇక మైనర్ ఇరిగేషన్ కింద సాగు చేసే రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం సహకారించాలని చౌహన్‌ను సీఎం చంద్రబాబు కోరారు. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాలకు కలిపి మొత్తం రూ.695 కోట్లు ఇవ్వాలని ఆయనను సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద తోతాపూరి రైతులకు ఇచ్చిన (మిగతా 2లో)

# ఉగ్రమూకల్ని వదలం



(మొదటి పేజీ (తరువాయి))

సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ భూటాన్ పర్యటనలో ఉన్నారు. ఆ దేశ రాజధాని థింపులో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. బాంబు పేలుడు వెనక ఉన్న కుట్రదారులను వదలబోమని.. బాధ్యులందరినీ చట్టం ముందు నిలబెడతామన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఏజెన్సీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ఢిల్లీ పేలుడు మనసు కలచి వేసిందన్నారు. భూటాన్ పర్యటనలో ఉన్న మోదీ.. ఢిల్లీ పేలుడుపై స్పందిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. చాలా బాధాకరమైన హృదయంతో భూటాన్ వచ్చాను. బాధితుల దుఃఖాన్ని అర్థం చేసుకున్నాను. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం. ఢిల్లీ బాంబ్ పేలుడు సూత్రధారులను విడిచిపెట్టబోం. కుట్రదారులను చట్టం ముందు నిలబెడతాం. ఇప్పటికే ఉగ్ర కుట్ర మూలాలను గుర్తించాం. ఢిల్లీ ఘటనపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే ఉన్నాం. పేలుడుపై అర్ధరాత్రి వరకు సమీక్షలు చేస్తూనే ఉన్నాం. బాధితుల వెంట దేశమంతా ఉందని మోదీ తెలిపారు. రెండు రోజుల పర్యటన కోసం ప్రధాని మోదీ మంగళవారం ఉదయం భూటాన్ వెళ్లారు. పర్యటన ముగించుకుని బుధవారం ఢిల్లీకి చేరుకోనున్నారు. అనంతరం రేపు సాయంత్రం 5:30 గంటలకు కేబినెట్ సమావేశం కానుంది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# పేలుడుపై దర్యాప్తు

(మొదటి పేజీ (తరువాయి))

కఠినంగా శిక్షిస్తాం అని చెప్పారు. బాధితులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు. ఈ చర్యలు శాంతికి భంగం కలిగించే వారికి ప్రయత్నంగా పేర్కొన్నారు. ఢిల్లీలో మంగళవారం మీడియా సమావేశంలో రక్షణ శాఖ మంత్రి మాట్లాడారు. 'ఎర్రకోట కారు పేలుడు ఘటనపై దేశంలోని భద్రతా, దర్యాప్తు సంస్థలు సమగ్రంగా దర్యాప్తు జరుపుతున్నాయి. దర్యాప్తు వివరాలు త్వరలోనే వెల్లడిస్తాము. నా దేశ ప్రజలకు హామీ ఇస్తున్నా.. ఏ పరిస్థితుల్లోనూ పేలుడుకు బాధ్యులను వదిలిపెట్టం. నిందితులను కఠినంగా శిక్షిస్తాం. బాధితులకు ప్రభుత్వం న్యాయం చేస్తుంది' అని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీతో సహా పలు ఏజెన్సీలు దర్యాప్తులో భాగం కానున్నాయి. ఢిల్లీ పేలుడు ఘటనపై దేశంలోని దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయని.. త్వరలో ప్రమాదానికి సంబంధించిన వివరాలు వెల్లడిస్తామని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. దాడికి కారణమైనవారిని వదిలిపెట్టమని.. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. ఇదిలా ఉంటే కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన మంగళవారం కీలక సమావేశం జరుగుతోంది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కార్యాలయంలో ఈ భేటీ ప్రారంభమైంది. హోం కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, జాతీయ దర్యాప్తు సంస్థ డైరెక్టర్ జనరల్, ఢిల్లీ పోలీస్ కమిషనర్, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జమ్మూ కాశ్మీర్ డీజీపీ, కేంద్ర పాలిత ప్రాంతం ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఢిల్లీ పేలుడుపై ప్రాథమికంగా అందిన సమాచారం, ఉగ్ర సంస్థల ప్రమేయం, భారీ కుట్రపై సమీక్షిస్తున్నారు.

# మంచి ఆలోచనతోనే అవకాశాలు



(మొదటి పేజీ (తరువాయి))

తయారుచేయాలని సూచించారు. ప్రకాశం జిల్లా కనిగిరిలోని పెదఇర్లపాడులో సీఎం పర్యటించారు. ఇందులో భాగంగా ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఇవాళ 329 ఎకరాల్లో 15 పారిశ్రామిక పార్కులను సీఎం ప్రారంభించారు. 587 ఎకరాల్లో మిగిలిన 35 ప్రభుత్వ ప్రైవేటు ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేశారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం నాయునిపల్లిలో చేనేత పార్కుకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. రాష్ట్రాభివృద్ధిలో ప్రజలను భాగం చేస్తున్నాం. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారు. వారు ఇచ్చిన భూమిని అభివృద్ధి చేసి వారికి అప్పగిస్తున్నాం. రాష్ట్రంలోని వనరులను సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు నిర్మిస్తాం. రాష్ట్రానికి అనేక పెట్టుబడులు తీసుకొచ్చాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ఏపీ బ్రాండ్‌ను మళ్లీ తీసుకొస్తున్నాం. పెట్టుబడులు తీసుకొచ్చి 20 లక్షల ఉద్యోగాలు ఇస్తున్నాం. 20 లక్షల ఉద్యోగాలంటే చాలా మంది అవహేళన చేశారు. ఇప్పటికే చాలా కంపెనీలు ముందుకు వచ్చాయి. ఈ వారంతం పెట్టుబడుల వెల్లువ కొనసాగుతోంది. పెట్టుబడులతో పాటు ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. కష్టపడి పనిచేసే అద్భుత యువత ఏపీలో ఉంది. గత వైకాపా పాలనలో పారిశ్రామికవేత్తలను బెదిరించడంతో వారు పారిపోయారని చంద్రబాబు అన్నారు. ఇకపోతే పలు జిల్లాల్లో మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శాంతి, ప్రేమను చాటుదాం..

(మొదటి పేజీ (తరువాయి))

పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు పుట్టపర్తి రావడానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి దాదాపు 200 బస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తాత్కాలిక వసతి మరుగుదొడ్లు వాహనాల పార్కింగ్ లలో చేస్తున్న ఏర్పాట్లపై వివరించారు. అమ్మకాలను పోలీసు రెవెన్యూ అగ్నిమాపకం ఇతర ముఖ్యమైన డిపార్ట్మెంట్ లతో ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తున్నట్లు వివరించారు. పుట్టపర్తి లో నిన్నటి నుంచి అక్కడక్కడ వైద్య ఆరోగ్యశాఖ ద్వారా క్యాంప్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అలాగే ఒక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి.. అన్ని శాఖల అధికారులను అందులో ఉంటారని.. ఎక్కడైనా ఏదైనా అవసరం, సమస్య వచ్చినప్పుడు కంట్రోల్ రూమ్ ద్వారా సంబంధిత అధికారులకు సమాచారం అందించి పరిష్కార చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అలాగే వివిధ అంశాలలో తీసుకున్న చర్యలను కూడా కలెక్టర్ వివరించారు. సమావేశంలో ఎస్పి ఎస్ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. శత జయంతి ఉత్సవాలకు వివిఐవి విఐపి ల రాకను దృష్టిలో ఉంచుకొని.. కట్టుదిట్టంగా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రణాళిక ప్రకారంవాహనాల మూమెంట్ ఉండేలా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం వివిధ అంశాలలో తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రులకు వివరించారు. స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ... భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతికి వచ్చే లక్షలాది భక్తులకు గుర్తుండి పోయాలా ఉత్సవాల నిర్వహణకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో వేదుతున్న పనులకు సంబంధించి వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలన్నారు సమావేశంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ... పుట్టపర్తి శ్రీ సత్య సాయిబాబా జన్మ దినోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జయంతి వేడుకల నిర్వహణపై ఇదివరకే సమీక్షించడం జరిగిందని ఈ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నందున ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని దీనికై జిల్లా యంత్రాంగం శ్రీ సత్య సాయిబాబా ట్రస్ట్ సభ్యులతో సమన్వయం చేసుకొని ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా శ్రీ సత్య సాయిబాబా మహాసమాధి దర్శన నిమిత్తం వచ్చే భక్తాదులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని వాహనాలకు పార్కింగ్ తో పాటు పట్టణంలో రాకపోకల ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి సూచించారు.

.ఈ సమీక్ష సమావేశంలో... రాష్ట్ర రవాణా ఆర్ అండ్ బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణ బాబు, పర్యాటక యువజన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, డిఐజి షిమోషి భాజ్పై, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఆర్డీవోలు సువర్ణ, వివిఎస్ శర్మ, మహేష్, జిల్లా అధికారులు, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 12కు చేరిన మృతుల సంఖ్య

(మొదటి పేజీ (తరువాయి))

కారణమైన ఐ20 కారుకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఆ కారు నడుపుతోన్న వ్యక్తి డాక్టర్ ఉమర్ మహ్మద్ అని పోలీసులు అనుమానిస్తున్నారు. గత రెండు రోజులుగా దేశవ్యాప్తంగా ఛేదిస్తోన్న ఉగ్ర కుట్రల్లో భాగంగా అరెస్టయిన వారిలోను వైద్యులు ఉండటం కలకలం సృష్టిస్తోంది. ఇప్పటివరకు మంత్రులు, అధికారులు దీనిని ఉగ్ర ఘటనగా పేర్కొన్నప్పటికీ.. చట్టవిరుద్ధ కార్యకలాపాల కింద దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెల్లడించారు. అయితే భయంతో ఉమర్ ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడా..? అనే కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది. నిషేధిత జైషే మహ్మద్, అన్సార్ గజ్‌వత్ ఉల్ హింద్ ఉగ్ర సంస్థలతో సంబంధం ఉన్న 8 మందిని అరెస్టు చేసినట్లు సోమవారం జమ్మూకశ్మీర్ పోలీసులు వెల్లడించిన సంగతి తెలిసిందే. వీరిలో ముగ్గురు వైద్యులు అదీల్ అహ్మద్, ముజమ్మిల్ షకీల్, షాహిన్ ఉన్నారు. వారిలోని మహిళా డాక్టర్ షాహిన్ సోమవారం లఖ్‌నవూలో అరెస్టు కాగా ఆమె కారు నుంచి ఏకే-47 రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కశ్మీర్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, కేంద్ర ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్ సహా సల్ఫర్‌తో కూడిన 2,900 కిలోల పేలుడు పదార్థాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు జమ్మూకశ్మీర్ పోలీసులు తెలిపారు. మరోపక్క గుజరాత్‌లో భారీ ఉగ్ర కుట్రకు ప్రయత్నించిన సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్‌తో పాటు మరో ఇద్దరు ఐసిస్ సానుభూతిపరులను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ కూడా ఒక డాక్టర్ కావడం గమనార్హం. ఈ పరిణామాల వేళ ఉమర్ ఆత్మాహుతి దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. తన సహచరుల అరెస్ట్, బాంబు తయారీలో వాడే పేలుడు పదార్థాల స్వాధీనంతో నిరాశ చెందిన అతడు ఈ పేలుడు పాల్పడి ఉండొచ్చన్న కోణాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఘటనపై దర్యాప్తు వేగంగా కొనసాగుతోంది. పేలుడుకు పాల్పడినట్టు అన ుమానిస్తున్న డాక్టర్ ఉమర్ మహమ్మద్ కుటుంబ సభ్యులు సహా ఆరుగురిని జమ్మూ కాశ్మీర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో ఉమర్ తల్లి షమీనా భానో, సోదరులు ఆషిక్ అహ్మద్, జాహ్ అహ్మద్, అలాగే ప్లంబర్ అమిర్ రషీద్, ప్రభుత్వ ఉద్యోగి అమీర్ రషీద్ మిర్, బ్యాంకు సెక్యూరిటీ గార్డ్ తారీఖ్ మాలిక్ ఉన్నారు. పోలీసుల సమాచారం ప్రకారం ఫరీదాబాద్ ఆయుధాల కేసులో పరారీలో ఉన్న ఉమర్ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కలిగి ఉండి, ఈ ఆత్మాహుతి దాడికి పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీల ద్వారా కారు కదలికలను పోలీసులు గుర్తించారు.

# అందెశ్రీ అంత్యక్రియలు

(మొదటి పేజీ (తరువాయి))

పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీలు వీ.హనుమంతరావు, సర్వే సత్యనారాయణ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విమలక్క పాల్గొన్నారు. అందెశ్రీ భౌతికకాయానికి నివాళు లు అర్పించారు. అందెశ్రీ పార్థివ దేహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. మంగళవారం ఉదయం ఘట్కేసర్ చేరుకున్న సీఎం.. అందెశ్రీ అంత్యక్రియలకు హాజరయ్యారు. అందెశ్రీ కుటుంబ సభ్యులను సీఎం రేవంత్ రెడ్డి ఓదార్చారు. లాలాపేట్ జయశంకర్ స్టేడియం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్కేసర్ వరకు అంతిమయాత్ర సాగింది. అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించింది. అందె శ్రీ అంత్యక్రియల్లో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, వి. హనుమంతరావు పాల్గొన్నారు. రచయిత అందెశ్రీ మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియల సందర్భంగా సీఎం అందెశ్రీ పాడెమోసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ నేతలను నేరుగా కలవనని చెప్పిన అందెశ్రీ, ఆ తరువాత మీడియా మధ్యమం ద్వారా కలిశాం.. ఆయన మరణం నాకు వ్యక్తిగతంగా ఆప్తుడిని కోల్పోయిన బాధను కలిగించింది అన్నారు. అందెశ్రీకి సముచిత న్యాయం కల్పిస్తాం.. ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. జీవితాంతం తెలంగాణ కోసం జీవించిన వ్యక్తి.. కళాకారుడిగా, రచయితగా ఆర్థికంగా ఎంత ఇబ్బంది పడ్డారో అందరికి తెలుసు అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉన్నంత వరకు అందెశ్రీ కీర్తి శాశ్వతం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆయన రచించిన రచనలు 20 వేల నిప్పుల వాగు పుస్తకాలను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అందుబాటులో పెడతాం అన్నారు. అందెశ్రీ అభిమానుల నుంచి సూచనలు తీసుకుంటాం.. ఏనాడు ఆర్థిక ఇబ్బంది గురించి ఆరోగ్యం గురించి ఆలోచించని వ్యక్తి అందెశ్రీ.. అతడ్ని కోల్పోవడం బాధాకరంగా ఉంది.. అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాశా, ఈ విషయంపై ప్రధాని మోడీని కలిసి విజ్ఞప్తి చేస్తాను.. అందుకు కేంద్రమంత్రులు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ కోరారు. అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. అలాగే ఆయన రచించిన జయజయహే తెలంగాణ పాటను పాఠ్యాంశంగా తీసుకొస్తామని తెలిపారు. అందెశ్రీ రచనలను పుస్తక రూపంలో తీసుకొస్తామని చెప్పారు. అందెశ్రీ నిప్పుల వాగు పుస్తకం ఒక గైడ్ అన్నారు. అందెశ్రీ రచనలు అన్ని లైబ్రరీల్లో ఉండేలా చర్యలు తీసుకుంటామని.. ఆయన పేరు, స్ఫూర్తి శాశత్వంగా ఉండేలా చూస్తామన్నారు. అందెశ్రీ పాట, మాట గొప్ప స్ఫూర్తిని ఇచ్చిందని.. ఎన్నో సందర్భాల్లో ఇద్దరం కలిసి అనేక కీలక అంశాలపై చర్చించామని గుర్తు చేసుకున్నారు. అందెశ్రీని కలిసినప్పుడల్లా సొంత అన్నను కలిసినట్టుగా ఉండేదన్నారు. గద్దర్ తో పాటు అందెశ్రీ పాటు తెలంగాణ ఉద్యమానికి ఎంతో బలాన్ని ఇచ్చాయని అన్నారు. అందెశ్రీ జయజయహే పాట తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి నింపిందని.. అందుకే జయజయహే పాటను రాష్ట్ర గీతంగా గుర్తించామని తెలిపారు. ఆయన పేరుతో ఒక స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అందెశ్రీ వ్యక్తిగతంగా తన మనసుకి దగ్గరి వ్యక్తి అని.. ఆయన లేని లోటు నా కుటుంబానికి వ్యక్తిగతంగా తీరని లోటన్నారు. అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని గత ఏడాది కేంద్రానికి లేఖ రాశామని కానీ అవార్డు రాలేదన్నారు. ఈ సంవత్సరం కూడా కేంద్రానికి లేఖ రాస్తామని.. ఆయనకు పద్మశ్రీ గౌరవం దక్కేలా కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి సహకరించాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలుగా అందెశ్రీని పద్మశ్రీతో గౌరవించుకునేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

# ఆంధ్రాను ఆదుకోండి

(మొదటి పేజీ (తరువాయి))

మద్దతు ధరలో కేంద్ర ప్రభుత్వ వాటాను సైతం విడుదల చేయాలన్నారు. ఆ క్రమంలో కేంద్ర ప్రభుత్వ వాటా కింద ఇవ్వాల్సిన రూ.100 కోట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. గుంటూరు పర్యటనకు వచ్చిన

నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆహ్వానం మేరకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్.. అమరావతిలోని క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. గుంటూరు జిల్లా వెంగళాయపాలెంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పర్యటించారు. నల్లపాడు లయోలా స్కూల్‌లో ఆయన పైలాన్ ఆవిష్కరించారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా వెంగళాయపాలెం చెరువు వద్ద రూ. 1.20 కోట్లతో చేసిన అభివృద్ధి పనులని శివరాజ్ సింగ్ చౌహాన్ పరిశీలించారు. అనంతరం వెంగళాయపాలెం చెరువును కేంద్ర మంత్రి చౌహాన్ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ.. పురాతన వెంగళాయపాలెం చెరువుని అత్యాదునికంగా పునరుద్ధరించారన్నారు. వెంగళాయపాలెం చెరువు ద్వారా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు. వెంగళాయపాలెం చెరువు ద్వారా పశువులకు తాగునీరు లభిస్తుందని పేర్కొన్నారు. మత్స్య సంపద పెంచడానికి, బోటింగ్ సౌకర్యానికి ఈ చెరువుని వినియోగించుకోవచ్చని సూచించారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ఓపెన్ థియేటర్.. ప్రజలకు ఆనందాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక కేంద్రమంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి పెమ్మసాని చంద్రశేఖర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, మహ్మద్ నజీర్, గల్లా మాధవితోపాటు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. మరోవైపు మొంథా తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో కేంద్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఈ తుఫాన్ కారణంగా జరిగిన నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. అనంతరం మంగళవారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలిసి.. జరిగిన నష్టాన్ని కేంద్ర బృందం సోదాహరణగా వివరించింది.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే హవా

హైదరాబాద్, నవంబర్ 11 :

తెలుగు రాష్ట్రాల్లో సర్వత్రా ఆసక్తి నెలకొన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ ముగిసింది. ఈనెల 14న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో గెలుపెవరిదనేదానిపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఇలా ఉన్నాయి. వివిధ సర్వేల ఆధారంగా అక్కడ కాంగ్రెస్ గెలుపు ఖాయమని తేలిపోయింది. అన్ని సర్వేల్లోనూ కాంగ్రెస్ ముందంజలో ఉండగా బిఆర్ఎస్ రెండోస్థానంలో ఉంది. ఇక బిజెపి అతి తక్కువ ఓట్ల శాతంతో మూడో స్థానంలో ఉంది. చాణక్య స్ట్రాటజీస్ కాంగ్రెస్‌కు 46శాతం, భారత రాష్ట్ర సమితికి 43 శాతం, బిజెపి 6 శాతం ఓట్లు వస్తాయని అంచనా వేసింది. హెచ్ఎంఆర్ సర్వే.. కాంగ్రెస్‌కు 48.3శాతం, భారత రాష్ట్ర సమితికి 43.18శాతం, భాజపాకు 5.84 శాతం ఓట్లు లభించే అవకాశముందని పేర్కొంది. స్మార్ట్ పోల్ సర్వే .. కాంగ్రెస్‌కు 48.2శాతం, భారత రాష్ట్ర సమితికి 42.1 శాతం, భాజపాకు 7.6 శాతం, ఇతరులకు 2.1శాతం ఓట్లు పోలయ్యే అవకాశముందని తెలిపింది. మొత్తంగా అన్ని సర్వేల్లోనూ కాంగ్రెస్ ఆధిక్యం కనిపించింది. దీంతో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ నేతలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో ఉప ఎన్నిక నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. 58 మంది అభ్యర్థులు బరిలో



ఉన్నా.. ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ ఉంది. భారత రాష్ట్ర సమితి తరఫున మాగంటి గోపీనాథ్ భార్య సునీత, కాంగ్రెస్ పక్షాన నవీన్ యాదవ్, భాజపా తరఫున లంకల దీపక్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. ఎన్నికను అధికార పార్టీ, ప్రతిపక్షాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. నియోజకవర్గంలోని రాజకీయ పరిణామాలు, ఓటర్లు ఇచ్చే తీర్పుపై రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆసక్తి నెలకొంది.

# బీహార్‌లో ఎన్డీఏకే పట్టం

పాట్నా, నవంబర్ 11 :

దేశంలో అతి పెద్ద రాష్ట్రాల్లో ఒకటైన బీహర్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. దీంతో ఈ ఎన్నికల్లో రాష్ట్ర ఓటరు ఏ పార్టీకి పట్టం కడతాడంటూ దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే ఈ ఎన్నికల్లో విజయవకాశాలు ఎన్డీయే కూటమికి ఉన్నాయంటూ పలు సర్వేలు స్పష్టం చేశాయి. మరి ఈ సర్వేల ఫలితాలు నిజమవుతాయా అనేది తెలియాలంటే.. నవంబర్ 14వ తేదీ వరకు ఆగాల్సి ఉంది. బీహర్ అసెంబ్లీలో మొత్తం 243 స్థానాలకు రెండు విడతలుగా పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో 67 శాతానికిపైగా ఓటింగ్ నమోదు అయినట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. ఈ ఎన్నికల వేళ.. ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. దీంతో ఎన్డీయే కూటమి, మహాఘట్‌బంధన్ ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మరోవైపు బీహర్‌లో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు సుడిగాలి పర్యటనలు నిర్వహించారు. అలాగే లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సైతం ఆ రాష్ట్రంలో ఇటీవల యాత్ర చేపట్టారు. బిహార్‌లో హోరాహోరీగా సాగిన అసెంబ్లీ ఎన్నికల పోరు ముగియడతో ఎగ్జిట్ పోల్ అంచనాలు వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఆయా సర్వేలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెల్లడించాయి.

# పదవులు భర్తీ

(మొదటి పేజీ (తరువాయి))

పలు అంశాలపై మంత్రి దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు మంత్రితో జోనల్ కోఆర్డినేటర్‌లు మంతెన సత్యనారాయణ రాజు, భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి, బీదా రవిచంద్ర యాదవ్, దామాచర్ల సత్య, సుజయ్ కృష్ణ రంగారావు, దీపక్ రెడ్డి, కోవెలమూడి రవీంద్ర, వేపాడ చిరంజీవి రావు, మందలపు రవి, పెళ్లకూరు శ్రీనివాస రెడ్డి తదితరులు సమావేశమయ్యారు. ప్రతిపక్షంలో ఉండి పోరాడినట్లే అధికారంలోనూ జోనల్ కోఆర్డినేటర్లు పని చేయాలని సూచించారు. పార్టీ అధికారం వచ్చిందని ఎవరూ నిర్లక్ష్యంతో ఉండకూడదని అన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు ఉన్న కసి, అధికారంలోనూ కొనసాగాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకుని పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. ఇన్చార్జ్ మంత్రులతో సమన్వయం చేసుకుంటూ స్థానిక ఎన్నికల వ్యూహరచన చేయాలని ఆదేశించారు. జనసేన, బీజేపీ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోట తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్‌ల సమన్వయం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న నియోజకవర్గాలకు తెలుగుదేశ పార్టీ ఇన్చార్జ్‌లను త్వరలోనే నియమిస్తామని మంత్రి ప్రకటించారు. ప్రతి నియోజకవర్గానికి ఎమ్మెల్యేలు వెళ్లి పార్టీ వ్యవహారాలపై సమీక్షించాలన్నారు. ఎమ్మెల్యేలు తప్పనిసరిగా గ్రీవెన్స్ నిర్వహించేలా పర్యవేక్షించాలని కోరారు. అర్జీలు ఇచ్చే వారికి ఎమ్మెల్యే స్థాయి లేదా ఇన్చార్జ్ మంత్రి స్థాయిలోనే సమస్య పరిష్కారమవ్వాలని సూచించారు. ఎమ్మెల్యేలకు కార్యకర్తలకు సమన్వయం పెంచే బాధ్యత జోనల్ కోఆర్డినేటర్లదేనన్నారు. జోనల్ కోఆర్డినేటర్ల పనితీరును ప్రతీ నెలా సమీక్షిస్తామని చెప్పారు. జోనల్ కోఆర్డినేటర్లే పార్టీకి అన్నీ తామై వ్యవహరించాలని సూచించారు. ఇన్చార్జ్ మంత్రులకు ఎమ్మెల్యేలకు మధ్య సమన్వయం పెంచటం, ఎమ్మెల్యేలతో సమస్య ఉన్న చోట ఇన్చార్జ్ మంత్రిని కూర్చోపెట్టి పరిష్కరించే బాధ్యతను కోఆర్డినేటర్లు తీసుకోవాలని పేర్కొన్నారు. వైసీపీ పెట్టిన అక్రమ కేసులపై సమీక్షించి చట్టపరంగా పరిష్కరిద్దామని తెలిపారు.

# అద్భుతమైన ప్రగతి

## కేంద్రమంత్రి శివరాజ్ పాటిల్



ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలయిక అద్భుతమని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కొనియాడారు. ఈ ముగ్గురూ కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. గుంటూరు జిల్లాలో పర్యటించిన కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. మధ్యప్రదేశ్‌లో ప్రజలు నన్ను మామ అని పిలుస్తారు.. ఇకపై ఏపీ వారికి కూడా నేను మామనే అని వ్యాఖ్యానించారు. గుంటూరు జిల్లా వెంగళాయపాలెం చెరువు వద్ద వాటర్ షెడ్ పథకం కింద రూ.1.20 కోట్లతో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మొక్కలు నాటారు. బావిలో నుంచి స్వయంగా నీళ్లు తోడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వెంగళాయపాలెం చెరువు పునరుద్ధరణ చూశాక చాలా సంతోషం వేసిందని శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. పురాతన చెరువును అత్యాధునికంగా తీర్చిదిద్దారని తెలిపారు. దీనిద్వారా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. పశువులకు తాగునీరు లభిస్తుందని అన్నారు. మత్స్య సంపద పెంచడానికి, బోటింగ్ సౌకర్యానికి చెరువును ఉపయోగించవచ్చన్నారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ఓపెన్ థియేటర్ వంటివి ప్రజలకు ఆనందాన్ని ఆరోగ్యాన్ని పంచుతాయని చెప్పారు. దేశవ్యాప్తంగా ఇదే తరహాలో చెరువుల పునరుద్ధరణ చేస్తానని మాటిచ్చారు. కేంద్రమంత్రి హోదా కంటే కూడా ప్రజలకు సేవ చేయడం కోసమే ఆంధ్రాకు వచ్చానని శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ప్రజా సేవను దైవ పూజగా భావిస్తానని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో నన్ను మామ అని అంటారని.. ఇకపై ఏపీ ప్రజలకు కూడా నేను మామనే అని వ్యాఖ్యానించారు.





అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఫయాజ్ బాషా

## ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

**తాడిపత్రి నవంబర్ 11:**
భారత స్వాతంత్ర సమరయోధుడు, తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు మంగళవారం హీరాపురం ఫయాజ్ బాషా నివాసంలో ఘనంగా నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం అజాద్ చిత్రపటానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఫయాజ్ బాష ట్రస్ట్ చైర్మన్ హీరాపురం ఫయాజ్ బాష పూలమాలలువేసి ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా హీరాపురం ఫయాజ్ బాషా మాట్లాడుతూ విద్య మన జీవితానికి వెలుగుయని, దేశ అభివృద్ధికి బాటయని తెలిపారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యా సేవలు మనకు ఎప్పటికీ స్ఫూర్తి, జ్ఞానమే నిజమైన బలమని తెలిపారు. అందరికి జాతీయ విద్యా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ మాజీ అధ్యక్షులు షాషావలి, వైకాపా నాయకులు రియాజ్, షబ్బీర్, కుమార్, చవ్వా రాజశేఖర్ రెడ్డి, షఫీ, షేక్షా, గౌస్, నూర్ తదితరులు పాల్గొన్నారు.



సగర ఉప్పర సంఘం డైరెక్టర్ ఆనంద్ రాజ్‌ను అభినందిస్తున్న టిడిపి శ్రేణులు

## ఉప్పర సంఘం వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఆనంద్ రాజ్‌కి సన్మానం

**కనేకల్, నవంబర్ 11 :**
ఉప్పర కుల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన యు.ఆనంద్ రాజ్‌కి మండల టిడిపి నాయకులు, ఉప్పర కుల సంఘ పెద్దలు మంగళవారం అభినందనలు తెలిపారు. పంచాయతీ పరిధిలోని కనేకల్ క్రాస్ లో నివాసం ఉన్న ఆనంద్ రాజ్ ఇంటికి వెళ్లి తమ అభిమానాన్ని కుటుంబ సభ్యులు సతీమణి మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ కౌసల్య, తమ్ముడు యు రవికుమార్,హరి,శ్రీధర్ తదితర బంధువుల మధ్య కేక్ కట్ చేసి శాలువాతో, పూలమాలలతో సత్కరించి తమ అభిమానాన్ని ఆనందాన్ని పంచుకున్నారు. టిడిపికి ఆనంద్ రాజు చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం సగర ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమించడం హర్షనీయమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజాసేవలో ప్రజలకు అందుబాటులో ఉండాలని కొనియాడారు. ఆనంద్ రాజు కు పదవి రావడానికి కృషిచేసిన విప్ కాల్వ శ్రీనివాసులకు, ప్రభుత్వానికి టిడిపి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం నా ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పదవికి వన్నెతెస్తానని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని వారి సమస్యలు తీరుస్తానని ఆనంద్ రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లాల్బు నాయకులు చంద్రశేఖర్ గుప్తా, బిటి రమేష్, మాబుసాబ్, ఫక్రుద్దీన్, చాంద్ భాషా, వన్నూరు స్వామి టిడిపి కార్యకర్తలు మరియు నాయకులు పాల్గొన్నారు.



కోటి సంతకాలు కార్యక్రమం చేపట్టిన వైసిపి నాయకులు

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి కోటి సంతకాల సేకరణ

**కనేకల్, నవంబర్ 11 :**
కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మండల పరిధిలోని మాల్యం గ్రామంలో మంగళవారం వైయస్సార్సీపి పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆదేశాల మేరకు ఈ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసిపి కన్వీనర్ బ్రహ్మానంద రెడ్డి తెలిపారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయడం వల్ల పేదలకు వైద్య విద్య అందకుండా పోతుందని ఈ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతం చేస్తామన్నారు. కోటి సంతకాల సేకరణ చేపట్టి గవర్నర్ కు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఉషారాణి, చంద్రశేఖర్ రెడ్డి,చిన్న సర్మాస్, వేమన,కొట్రే గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కరువు పనుల బిల్లులు త్వరగా ఇవ్వండి

**యాడికి, నవంబర్ 11:**
యాడికి మండలంలో వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన గృహాలకు ఉపాధి హామీ పథకం కింద బిల్లులను త్వరగా చేయాలని ఏపీడి పుల్లారెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం ఎంపీటీవో కార్యాలయంలో ఏపీడి పుల్లారెడ్డి. ఎంపీడీవో వీర రాజు. హౌసింగ్ ఏఈ లోకేష్ కుమార్. ఏపీవో మద్దిలేటి. వారి సిబ్బందితో సమావేశం నిర్వహించి వారు వివరిస్తూ గత వైసీపీ ప్రభుత్వంలో మండల వ్యాప్తంగా 420 గృహాలు మంజూరు అయ్యాయి.కాగా అప్పట్లో ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డ్ లేనివారికి ఇప్పుడు జాబ్ కార్డు చేయించి బిల్లులు వెయ్యాలని ఏపీడి పుల్లారెడ్డి సిబ్బందికి తెలిపారు. గత ప్రభుత్వంలో యాడికి మండలంలో 420 గృహాలకు మంజూరు కాగా అందులో 240 గృహాలకు ఉపాధి హామీ బిల్లులో వేశారని మిగతా 180 లబ్ధిదారులకు బేస్ మట్టం నిర్మాణంలో ఉన్నవారికి 50 రోజుల పని దినం బిల్లులు. గృహాలు పూర్తి అయిన వారికి 90 రోజుల పని దినం డబ్బులను వెయ్యడానికి సిబ్బంది సహకరించి పూర్తి చేయాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. జాబ్ కార్డ్ లేని వారికి ఇప్పియ్యాలని త్వరగా పూర్తి చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడి పుల్లారెడ్డి. ఎంపీటీవో వీర రాజు. హౌసింగ్ ఏఈ లోకేష్ కుమార్. ఏపీవో మద్దిలేటి. టిఎల్ లు. సీసీలు. కంప్యూటర్ ఆపరేటర్లు. ఫీల్డ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ పుల్లారెడ్డి. ఎంపీడీవో వీర రాజు

# ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

**శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి..**

**తాడిపత్రి, నవంబర్ 11:**
భారతదేశ స్వాతంత్ర సమరయోధులు, తొలి కేంద్ర విద్యా శాఖ మంత్రివర్యులు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను తాడిపత్రి వక్ఫ్ బోర్డ్ సభ్యుల అధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి సీబీ రోడ్డు లోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు ఆర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా నవంబర్ 11న దేశ వ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని (రాష్ట్రీయ స్థానిక శిక్షా దివస్) జరుపుకుంటున్నామని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మానవతావాది, బహు భాషా ప్రవీణుడు, భారత దేశ తొలి విద్యా మంత్రి



మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి



చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకోవాలని 2008, సెప్టెంబరు 11న కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకటించిందన్నారు. మూలానా అబుల్ కలాం ఆజాద్ గొప్ప ఇస్లామిక్ పండితుడని, అరబిక్, ఉర్దూ భాషల్లో అద్భుత పాండిత్యం కలవారని, చిన్న వయసులోనే మత, సాహిత్య, తాత్విక విషయాల్లో విశేష పరిజ్ఞానం చూపడంతో ప్రజలు ఆయనను గౌరవంగా మౌలానాగా కీర్తించారని తెలిపారు.

పాత ఈద్గా మైదానంలోని వక్ఫ్ బోర్డు కార్యాలయంలో ముస్లిం మదరసాలలో, ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పేద ముస్లిం బాల,బాలికలకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లను ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ అధ్యక్షులు అయూబ్, మునిసిపల్ వైస్ చైర్మన్ షేక్షావలి, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ హయత్ బాషా ఖాద్రీ, ముస్లిం మైనారిటీ సోదరులు, నూర్ భాషా సోదరులు పాల్గొన్నారు. వక్ఫ్ బోర్డ్ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్న వారికి అల్పాహారం ఏర్పాటు చేశారు.





పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో అన్న ప్రసాదాలు తయారు చేస్తున్న దృశ్యం

# పంపనూరు ఆలయానికి భక్తుల తాకిడి

**అన్న ప్రసాదాల తయారీకి ఇబ్బంది పడుతున్న అన్నదాన సమితి..**

**ఆత్మకూరు, నవంబర్ 11:**
పంపనూరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ దర్శనార్థం వచ్చే భక్తుల సంఖ్య నానాటికి పెరుగుతుండడంతో అన్న ప్రసాదాల తయారీకి అన్నదాన సమితి వారు నానా అవస్థలు పడుతున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి వచ్చాక ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగిపోయిందని అందరి నోటా ఒకటే మాట. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత దర్శనం, ఉచిత ప్రసాదం. వెరసి నిర్వాహకులకు కష్టాలు



పంపనూరులో స్వామి దర్శనానికి క్యూలో వెళ్తున్న భక్తులు



ఆత్మకూరు మండలం పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అన్న ప్రసాదాలు ఆరగిస్తున్న భక్తులు

అన్న చందంగా తయారయింది పరిస్థితియని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న ఆలయం నిర్మాణం కాకమునుపు 10, 20 మందితో ప్రారంభమైన అన్నదానం నేడు వేలాదిమందికి అన్నదాన సమితి వారు నిస్వార్థంగా సమకూరుస్తున్నారు. అన్నదానం చేయడానికి ఇబ్బంది పడలేదు గాని తయారు చేయడానికి నానా అవస్థలు పడుతున్నట్లు స్పష్టమవుతోంది. దేవాదాయ శాఖ భవిష్యత్తులో రు.14 కోట్లకు పైగా నిధులు వెచ్చించి విశాలమైన రీతిలో ఆలయాల పునర్నిర్మాణానికి సంకల్పించింది. ఇప్పుడున్న ఆలయం భక్తుల తాకిడికి సరిపోవడం లేదు. అన్నదాన మహిమతోనే ఆలయ ప్రాశస్త్యం బాగా వెలుగులోకి వచ్చిందని రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలి రావడం అందుకు నిదర్శనంగా పేర్కొంటున్నారు.

## నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రమేష్ బాబు

**తాడిపత్రి, నవంబర్ 11:**
నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తాడిపత్రికి చెందిన రమేష్ బాబు ఏకగ్రీవంగా ఎంపికైనారు. గుంటూరు నగరంలో మంగళవారం నాయి బ్రాహ్మణ కన్వెన్షన్ హాల్ నందు నిర్వహించిన నాయి బ్రాహ్మణ రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశంలో రమేష్ బాబు ఏకగ్రీవంగా ఎంపికైనారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరి బాల గురుస్వామి తనమీద పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయనని, నాయి బ్రాహ్మణులందరికీ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వము, అధికారుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా నాయి బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేశారు.



# ఆత్మ నిర్భర్ భారత్ సంకల్ప ప్రతిజ్ఞ

**బీజేపీ నేతలు..**

**తాడిపత్రి, నవంబర్ 11:**
తాడిపత్రి పట్టణంలో 208 పోలింగ్ బూత్ అంబేద్కర్ నగర్‌లో భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మైదుకూరు ఆంజనేయులు ఆధ్వర్యంలో బీజేపీ నేతలు ఆత్మ నిర్భర్ భారత్ సంకల్ప ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఇంటింటా స్వదేశీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణి చేసి, మన స్వదేశీ వస్తువుల గురించి అవగాహన కల్పించారు. 208 పోలింగ్ బూత్ లోని అంగన్వాడి కేంద్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార కిట్లను గర్భిణీ స్త్రీలకు, చంటి బిడ్డల తల్లులకు అందించారు. కొంతమంది మహిళలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారని, చెత్తను బయట వేయకుండా మున్సిపాలిటీ ట్రాక్టర్లకు అందించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి రోజు మనం తీసుకొనే ఆహారం లో చిరుధాన్యాలు రాగులు, జొన్నలు, సజ్జలు, అరికలు, నల్ల నువ్వులు, తెల్లనువులతో చేసినటువంటి వంటకాలను తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు చెన్నా రంగనాయకులు, పట్టణ ప్రధాన కార్యదర్శి జూటూరు ఓబిరెడ్డి, సంజీవ రెడ్డి, ఉపాధ్యక్షులు వంశీ, ఆనంద్ రెడ్డి, కార్యదర్శి ఈశ్వయ్య, దళిత మోర్చ అధ్యక్షుడు రంగ, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు అమరావతి, పార్టీ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆత్మ నిర్భర్ భారత్ సంకల్ప ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నేతలు



ఉపాధి హామీ పథకం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించిన ఎంపీడీవో జి.లక్ష్మీనరసింహ

## ఉపాధి పనులపై సమీక్ష

**ఎంపీడీవో జి.లక్ష్మీనరసింహ..**

**ఆత్మకూరు, నవంబర్ 11:**
ఆత్మకూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో జి లక్ష్మీనరసింహ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న ఈ కేవైసీ సర్వే త్వరగా పూర్తి చేయాలని లేకపోతే కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే బిల్లులు చెల్లించడం కష్టమవుతుందని పేర్కొన్నారు. మండలం నందు మంజూరైన పశువుల షెడ్లు నిర్మాణము, మంజూరైన సోక్ మరియు కంపోస్ట్ పిట్ల నిర్మాణం, ఫారం పాండ్ల నిర్మాణం తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా జరుగుతున్న ఇతర పథకంల గురించి సమీక్షించి వీటిని తొందరగా వంద శాతం పూర్తి అగునట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు . ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జమీల్ భాష, ఏపీఓ వెంకట నారాయణ, ఈసీ బబ్లు, మండలంలోని టిఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన డివిజనల్ అభివృద్ధి అధికారి నాగసాయిలీల

## ఇంటి పన్నుల వసూలు సక్రమంగా చేపట్టాలి

**డివిజనల్ అభివృద్ధి అధికారి నాగసాయిలీల..**

**ఆత్మకూరు, నవంబర్ 11:**
ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో అనంతపురం డివిజనల్ అభివృద్ధి అధికారి నాగసాయిలీల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో స్వర్ణ పంచాయితీ ద్వారా ఇంటి పన్నుల వసూలు సక్రమంగా జరిగేటట్టు చర్యలు తీసుకోవాలని, వీలైనంత తొందరగా పన్నులు వసూలు చేయాలని సూచించారు, సమిత్వ సర్వే ద్వారా ప్రతి ఇంటి యజమానికి యాజమాన్య పత్రం జారీ చేయాలని అది ఆస్తి లాగా వారు ఉపయోగించుకోవచ్చునన్నారు. ప్రభుత్వ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మంచి సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనరసింహ, డిప్యూటీ ఎంపీడీవో షాదీక్, ఏపీవో వెంకటనారాయణ, ఈసీ బబ్లు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



అగాపే ఆశ్రమంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

## అగాపే ఆశ్రమంలో అన్నదానం

**యాడికి, నవంబర్ 11:**
యాడికి కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో మంగళవారం నంద్యాల జిల్లా అబ్దుల్లాపురం గ్రామ వాస్తవ్యులు వీరాపురం కళావతి, ఆమె పెద్ద కుమారుడు వీరాపురం సునీల్, భార్య కీర్తన, చిన్న కుమారుడు సీమోన్, మనవరాలు తనుషా, మనవడు చర్విక కుటుంబం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. చిన్న బిడ్డ తనూష పుట్టినరోజు శుభ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. ఆశ్రమం ఫౌండర్ బత్తల ప్రసాద్, ఆశ్రమంలోని వారంతా ఆ బిడ్డకు శుభాకాంక్షలు తెలియజేసి,వారి కుటుంబానికి అభినందనలు తెలిపారు.

## ఇంటి కోసం దరఖాస్తు చేసుకోండి

**హౌసింగ్ ఏఈ లోకేష్ కుమార్..**

**యాడికి, నవంబర్ 11:**
యాడికి మండలంలోని ప్రజలు తమకు ఇంటి స్థలం కలిగివున్న వారు ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ లోకేష్ కుమార్ తెలిపారు. ఆవాస్ ప్లస్ 2024 యాప్ ప్రస్తుతం వర్క్ అవుతోంది, కావున స్థలం కలిగియుండి ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం క్రింద ఇంటి కొరకు అప్లై చేసుకున్న లబ్దిదారులు మీ సచివాలయం నందు పని చేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ గారితో యాప్ నందు సర్వే చేపించుకోవాలని తెలిపారు. ఈ నెల నవంబర్ – 30 వ తారీఖు చివరి తేదీ అని ప్రజలు గ్రహించి దరఖాస్తు చేసుకోవాలనుకున్నవారు త్వరగా చేసుకోవాలని హౌసింగ్ ఏఈ లోకేష్ కుమార్ తెలిపారు.



## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నేడు మడకశిరలో ర్యాలీ

### మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్..

**అగళి, నవంబర్ 11:**
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మడకశిర పట్టణంలో బుధవారం ఉదయం 11 గంటలకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు వైఎస్ఆర్సీపీ మండల అధ్యక్షులు స్టూడియో శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశానికి మడకశిర నియోజకవర్గం సమన్వయకర్త ఈరలక్కప్పతో పాటు ముఖ్య నాయకులు హాజరవుతారు.కావున రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు నియోజకవర్గ మండల నాయకులు,కమిటీ సభ్యులు గ్రామ సర్పంచ్లు,ఎంపీటీసీలు, పార్టీ పెద్దలు,నూతనంగా ఎన్నుకోబడిన గ్రామ పంచాయతీ అధ్యక్షులు, సోషల్ మీడియా కన్వీనర్లు,వివిధ అనుబంధ కమిటీ సభ్యులు,వైఎస్ఆర్సిపి కార్యకర్తలు,ప్రతి ఒక్కరూ తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్ఆర్సీపీ మండల అధ్యక్షులు స్టూడియో శ్రీనివాస్ కోరారు.



## విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు

### ఆర్డిటి ఏరియా లెవెల్ ఆర్ట్ ఫెస్టివల్..

**బత్తలపల్లి నవంబర్ 11:**
గ్రామీణ ప్రాంత విద్యార్థులలో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతో, రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బత్తలపల్లి ఆర్డిటి ఫీల్డ్ ఆఫీసు నందు ఏరియా లెవెల్ ఆర్ట్ ఫెస్టివల్ అత్యంత ఉత్సాహం గా జరిగింది.విద్యార్థులలోని కళా నైపుణ్యాలను గుర్తించడంలో ఆర్డిటి చేస్తున్న కృషికి ఈ కార్యక్రమం అద్దం పట్టింది.ఆర్డిటి సంఘం పాఠశాలల నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మొత్తం ఆరు విభిన్న ఈవెంట్లలో విద్యార్థులు పోటీలలో రంగోలిలో సాయి పల్లవి నిడిగల్లు గ్రామం, హ్యాండ్ రైటింగ్ లో రిషితానంద మాల్యవంతం, పిక్చర్ పెయింటింగ్ కృతిక్, మాల్యవంతం. మట్టితో బొమ్మలు చేయడం రంజిత్ కుమార్ ఈదుల ముష్టూరు, పేపర్ కటింగ్ లో శ్రీ వైష్ణవి గంటాపురం, నాచురల్ కోలేజ్లో లికిత వీరందరూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గెలుపొందారు.విజేతలకు ఆర్డిటి అధికారులు బహుమతులు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యాబోధనతో పాటు ఇలాంటి కళాత్మక పోటీలను నిర్వహించడం ద్వారా పిల్లలలోని దాగి ఉన్న నైపుణ్యాలను ఆర్డిటి గుర్తించి ప్రోత్సహిస్తోందని, ఈ కృషి ఎంతో అభినందనీయం అని కొనియాడారు. విద్యార్థులు తమ ఆలోచనలను, సృజనాత్మకతను స్వేచ్ఛగా వ్యక్తం చేయడానికి ఈ వేదిక గొప్ప అవకాశం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమం లో ఏటీల్ కృష్ణ, ఎం ఈ ఎస్టిఎల్ కావేరి, ఫీల్డ్ ఆఫీసర్ కేశవ రెడ్డి, సిఓలు నాగరాజు, రమణప్ప, సిబిటిలు వీరనారప్ప, సుదర్శన్, రామకృష్ణ, వెంకటేష్ నాయక్, నీరజ, వెంకటలక్ష్మి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులు ఆర్డిటి సిబ్బంది.


ప్రయోగరాజ్‌లోని దేవాలయంలో కుటుంబ సభ్యులతో గుండుమల తిప్పేస్వామి

## ప్రయాగరాజ్‌లో మాజీ ఎమ్మెల్సీ గుండుమల కుటుంబం

**రోళ్ల, నవంబర్ 11 :**
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాగరాజ్ లోని త్రివేణి సంఘం(గంగా, యమున, సరస్వతీ) నదులలో పవిత్ర స్నానం ఆచరించి ప్రయాగరాజ్ లో గల పలు దేవాలయాలను కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకొన్నారు. మూడు రోజుల పాటు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తన కుటుంబ సభ్యులతో కలిసి కర్ణాటకలోని ముఖ్యమైన పుణ్యక్షేత్రాల సందర్శన కు వెళ్లారు.ఇందులో భాగంగా మంగళవారం ప్రయోగరాజ్ లోని పలు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల పరిశీలన

### జిల్లా విద్యాశాఖ సహాయ కమిషనర్ మలాది లాజర్..

**అగళి, నవంబర్ 11 :**
మార్చి 26 నుంచి జరుగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించి మండలంలో ఏర్పాటు చేయనున్న పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాధికారి కార్యాలయం పరీక్ష సహాయ కమిషనర్ మలాది జాలర్, పెనుకొండ డివిజనల్ ఉప విద్యాధికారి జాన్ రెడ్డప్ప మంగళవారం పరిశీలించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ఆదర్శ పాఠశాల,కేజీబీవీ పాఠశాలలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాలకు అనువుగా ఉన్నాయా,లేదా పరిశీలించి ఏర్పాట్ల కోసం మండల విద్యాధికారికి సూచించారు .అనంతరం తరగతి గదులలోకి వెళ్లి ఉపాధ్యాయుల బోధన అలాగే విద్యార్థుల చదువు పట్ల ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో వారితోపాటు ఎంఇఓ కృష్ణమూర్తి రాజు,ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యాబోధన పట్ల విద్యార్థులను అడుగుతున్న విద్యాధికారులు


కేజీబీవీలో పరిశీలిస్తున్న జిల్లా మండల విద్యాధికారులు


వ్యాయామ ఉపాధ్యాయుడు జగదీష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## వ్యాయామ ఉపాధ్యాయుడు జగదీష్‌కు ఘన సన్మానం

**ముదిగుబ్బ, నవంబర్ 11:**
జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే కష్టాలు, సవాళ్లను ఎదుర్కోవాల్సిందే. అలాంటి సవాళ్లను అధిగమించి విజయాన్ని సాధించిన వ్యాయామ ఉపాధ్యాయుడు జగదీష్ ను దొరిగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ%-%2025లో ఉత్తీర్ణత సాధించి, దొరిగల్లు ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడిగా నియామకం పొందిన జగదీష్ ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.లక్ష్మీనారాయణ శాలువాతో సన్మానించి, సర్వీస్ పుస్తకాన్ని బహూకరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుని ఇష్టంగా కొనసాగించాలని కృషి, పట్టుదల ఉంటే ఎవరైనా ఉన్నత స్థానాలను చేరుకోగలరని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యనారాయణ చారి, నారపరెడ్డి, గోపాల్, ప్రసాద్ బాబు, విరుపాక్షి తదితరులు పాల్గొని జగదీష్ ని అభినందించారు. అనంతరం పాఠశాల విద్యార్థుల చప్పట్లతో ప్రాంగణం హర్షాతిరేక వాతావరణంతో మార్మోగింది.

## ఉపాధ్యాయులపై బోధనేతర పనుల ఒత్తిడి వద్దు

### ఫ్యాప్టో నేతలు..

**నంబులపూలకుంట, నవంబర్ 11:**
బోధనేతర పనులు చేయాలంటూ అధికారులు ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం మంచిది కాదని ఫ్యాప్టో చైర్మన్ గజ్జల హరిప్రసాద్ రెడ్డి, సెక్రటరీ జనరల్ గౌస్ లాజం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలలో బోధనేతర కార్యక్రమాలు నిత్య కృత్యమైన వేళ ఫ్యాప్టో పక్షాన ఇది వరకే బోధనేతర కార్యక్రమాల బహిష్కరణకు పిలుపునిచ్చామని తెలిపారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ జిల్లా విద్యాశాఖాధికారులకు సెప్టెంబర్ 10వ తేదీ నుండి పిల్లలు ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం, పరీక్షల నిర్వహణ తప్ప మిగతా బోధనేతర పనులు అన్నిటిని బహిష్కరిస్తున్నామని వినతిపత్రం సమర్పించడం జరిగిందని తెలిపారు. ఉన్నతాధికారులు బోధనేతర కార్యక్రమాలు నిర్వహించాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఉన్నతాధికారులు బోధనేతర పనులు చేయాలంటూ ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం మానాలని లేని పక్షంలో ఫ్యాప్టో పక్షాన ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి ఉంటుందన్నారు.

## కంటి ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

### విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు ..

**బత్తలపల్లి, నవంబర్ 11:**
కంటి ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని, చిన్న వయసు నుంచి సెల్ ఫోన్ వినియోగం వల్ల దృష్టి సంబంధిత సమస్యలు ఎక్కువవు తున్నాయని ధర్మవరం ప్రముఖ కంటి వైద్య నిపుణులు ఉరుకుందప్ప పేర్కొన్నారు. మండల కేంద్రమైన బత్తలపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం దృష్టి సమస్యలకు సంబంధించి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు దృష్టి సంబంధ సమస్యలు, కంటి ఆరోగ్యమును ఏవిధంగా కాపాడుకోవాలి అన్న అంశాలపై వివరించారు. విద్యార్థులు సెల్ ఫోన్ ను తక్కువగా వాడాలన్నారు. విద్యార్థులు కంటి సంరక్షణ జాగ్రత్తలు వివరించారు. అనంతరం 253 మంది విద్యార్థులకు పరీక్షించగా అందులో 8 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని నిర్ధారించారు. వారికి త్వరలోనే ప్రభుత్వం ద్వారా కంటి అద్దాలు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. మరోక విద్యార్థికి పూర్తి స్థాయి కంటి పరీక్షల కొరకు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు. వీరికి త్వరలో జిల్లా అందత్వ నివారణ సంస్థ ( డిబిసిఎస్) ఆధ్వర్యంలో అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా అసిస్టెంట్ మారుతి. ముత్యాలమ్మ ఆశా కార్యకర్తలు కళావతి, సునీత, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

## నేడు ఎం. రాయపురం కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశం

### మండల పార్టీ అధ్యక్షులు జి కె ఈరన్న.. సింగిల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి.. ఏపీఐఐసి డైరెక్టర్ రామక్రిష్ణ.. మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్ ..






**రోళ్ల, నవంబర్ 11 :**
మడకశిర పట్టణంలోని శాసనసభ్యులు క్యాంపు కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 12.00 గంటలకు రొళ్ల మండలం ఎం.రాయాపురం గ్రామ పంచాయితీ పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే ఎ ఎస్ రాజు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తునట్లు మండల పార్టీ అధ్యక్షులు జి కె ఈరన్న, సింగిల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి,ఏపీఐఐసి డైరెక్టర్ రామక్రిష్ణ మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్ తెలిపారు. ఎం.రాయపురం పంచాయతీలోని నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.


యూనియన్ బ్యాంకు 107వ వార్షికోత్సవ వేడుక లు నిర్వహించిన దృశ్యం

## ఘనంగా యూనియన్ బ్యాంకు 107వ వార్షికోత్సవం

### మేనేజర్ శ్రీనివాసులు రెడ్డి ..

**తనకల్లు, నవంబర్ 11:**
తనకల్లు మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ బాలసముద్రం బ్రాంచ్ యూనియన్ బ్యాంకు 107వ వార్షికోత్సవం మంగళవారం మేనేజర్ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు స్థాపించి నేటికీ 107 సంవత్సరాలు అయిన సందర్భంగా 107వ వార్షికోత్సవం నిర్వహించామన్నారు. బ్యాంకు యొక్క సేవలను వివరించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పియంజేజేవై, ఎపివై, పియంయస్ బి వై వంటి ఇన్సూరెన్స్ పథకాలు గురించి వినియోగదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు మన్సూర్, నవీన్ కుమార్, అకౌంటెంట్ సాయి తేజ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి,బాబ్జాన్ వాసుదేవాచారి, ఆది,శీను బ్యాంకు మిత్రాల సిబ్బంది. మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బాగేపల్లి చలపతి, సోంపాళ్యం నాగభూషణ, సిద్ధారెడ్డి, చిన్నకృష్ణ, బ్యాంకు వినియోదారులు తదితరులు పాల్గొన్నారు.


యూనియన్ బ్యాంకు 107వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న మేనేజర్ శ్రీనివాసులు రెడ్డి.

## ప్రధాని పర్యటనపై సమీక్ష

**పుట్టపర్తి, నవంబర్ 11:**
భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 100వ జయంతి వేడుకల ఏర్పాట్లపై పుట్టపర్తిలో మంత్రుల బృందం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు, శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నాను. సమావేశంలో రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ , అనం నారాయణరెడ్డి , అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్ , మాజీ మంత్రి పల్లె రాఘునాథ్ రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమం ర్యాలీ విజయవంతం చేయండి

### పోస్టర్ ఆవిష్కరించిన వైకాపా నాయకులు ..

**రోళ్ల, నవంబర్ 11 :**
మడకశిర నియోజకవర్గ కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ వ్యతిరేక ప్రజా ఉద్యమాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ కన్వీనర్ నరసింహరెడ్డి కోరారు. వైస్సార్సీపీ ప్రజాఉద్యమం పోస్టర్లను నాయకులతో కలసి విడుదల చేశారు.ఈ సందర్భంగా బుధవారం మడకశిర వైఎస్ఆర్ సర్కిల్లో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున మండలంలోని సర్పంచులు ఎంపీటీసీలు సభ్యులు వైసిపి బూత్ కమిటీ మెంబర్లు పంచాయతీ అధ్యక్షులు వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహారెడ్డి, నియోజకవర్గ జె సి ఎస్ కన్వీనర్ నాగేంద్ర,ఎంపీటీసీ జగదీష్ బాబు, నాయకులు నగేష్ రంగారెడ్డి, ఎర్రగుంటేశ్వర, సోమశేఖర్, రవి,తదితరులు పాల్గొన్నారు.


ప్రజా ఉద్యమం పోస్టర్లు విడుదల చేస్తున్న వైకాపా నాయకులు

## శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వినతి

**అగళి, నవంబర్ 11:**
బలిజల ఆరాధ్య దైవం శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహం ఏర్పాటుకు మండల కేంద్రంలో స్థలం కేటాయించాలని తహసీల్దార్ కార్యాలయంలో బలిజ కుల సంఘాల నాయకులు కుల బాంధవులు మంగళవారం తహసీల్దార్ సుబ్బారావుకు వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విగ్రహం ఏర్పాటుకు తప్పకుండా స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు జెడ్పిటిసి ఉమేష్, మాజీ సింగల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ శివప్ప, మైనారిటీ నాయకుడు మాజీ మండల టిడిపి కన్వీనర్ షౌకత్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ సుబ్బారావుకు వినతిపత్రం అందిస్తున్న బలిజ కుల సంఘాల నాయకులు

## పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం

### రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా సానేవారిపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరం.. గర్భకోశ వ్యాధులపై అవగాహన..

**ముదిగుబ్బ, నవంబర్ 11:**
ముదిగుబ్బ మండలం సానేవారిపల్లి గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో మంగళవారం పశువుల గర్భకోశ వ్యాధులపై ఉచిత చికిత్సా శిబిరం, పాడి రైతులకు అవగాహన నిర్వహించారు. పాడి రైతులలో అవగాహన పెంపుతో పాటు మేలు జాతి ఆవుల ఉత్పత్తి పెంపే లక్ష్యంగా ఈ శిబిరం చేపట్టినట్లు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణ అధికారి డా.జి.వెంకటేశులు తెలిపారు. “రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో రూ.500 విలువగల లింగ నిర్ధారిత వీర్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని అధిక పాల దిగుబడి ఇచ్చే మేలు జాతి ఆవులను పెంచుకోవచ్చు,” అని అన్నారు. రైతులు ఆధునిక పద్ధతుల్లో పాడి పశుసంవర్ధక పద్ధతులు అవలంబించాలని, దీని ద్వారా గ్రామీణ ఆర్థికాభివృద్ధికి తోడ్పడవచ్చని సూచించారు. పశువైద్య శస్త్రచికిత్స నిపుణుడు డా. శ్రీకాంత్ మాట్లాడుతూ... గర్భకోశ వ్యాధులు పశువుల ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తాయని సమతుల్య పోషకాహారం, పచ్చిమేత వినియోగం, సమీకృత దాణా వాడకం ద్వారా వీటిని నివారించవచ్చుని అన్నారు. ఉచిత పశువైద్య శిబిరంలో 60 పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి రూ.20 వేల విలువగల ఉచిత మందులు రైతులకు పంపిణీ చేశారు. దూడలకు నట్టల నివారణ మందులు అందించినట్లు ముదిగుబ్బ పశువైద్యాధికారి డా.రామేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక సహాయకులు, కూటమి నాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.


పశువులకు వైద్యం చేస్తున్న డా.రామేశ్వరరావు


పాడి రైతులకు మందులు అందజేస్తున్న పశువైద్యాధికారులు

## ఏం నాయనా.. బాగున్నావా...

### మంత్రిని చూసి పొంగిపోయిన ఉపాధ్యాయుడు గంగాధర శాస్త్రి గురువు కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకున్న పయ్యావుల కేశవ్..

**పుట్టపర్తి , నవంబర్ 11:**
ఆయన సాధారణ ఉపాధ్యాయుడిగా రిటైర్డ్ అయ్యారు. తన వద్ద విద్యాభ్యాసం నేర్చుకున్న ఒక విద్యార్థి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బాగుచేసే ఒక ఆర్థికవేత్త అయితాడని ఏనాడు ఊహించలేదు. అయితే తనకు చిన్ననాటి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుని వద్దకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గురువుకు కాళ్లు మొక్కి ఆశీర్వాదం కోరాడు. ఈ సంఘటన పవిత్ర ఆధ్యాత్మిక పట్టణమైన పుట్టపర్తిలో చోటుచేసుకుంది. ఉపాధ్యాయుడు గంగాధర శాస్త్రి వద్ద చిన్ననాట మంత్రి పయ్యావుల కేశవ్ విద్యాబుద్ధులు నేర్చుకున్నారు. పుట్టపర్తి లోని శాంతి నిలయంలో గంగాధర్ శాస్త్రి ఉంటున్న విషయాన్ని తెలుసుకొని వెంటనే ఆర్థిక మంత్రి అక్కడికి వెళ్లి విద్యార్థి దశలో ఆ గురువుతో అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ మధ్యకాలంలో తనకు అమితానందం కలిగించిన దినం తన గురువును కలవడమేనని ఈ సందర్భంగా మాంత్రి భావోద్వేగానికి గురయ్యారు.





భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

# క్రమశిక్షణతో చదివిన ప్రతి విద్యార్థి మేధావి

## సిఐ అశోక్ కుమార్..

**కౌతాళం, నవంబర్ 11:**

క్రమశిక్షణతో చదివిన ప్రతి విద్యార్థి మేధావి అని సిఐ అశోక్ కుమార్ అన్నారు. మండలం కేంద్రంలోని ప్రతిభ హైస్కూల్‌లో భారతరత్న, స్వతంత్ర భారతదేశనికి మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో విద్యార్థులపై కీలక పాత్ర కావున ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ప్రతి విద్యార్థి మేధావి కాగలడు అని సూచించారు.
అనంతరం స్వాతంత్ర సమరయోధుల,, వీర నారీమణుల మరియు సామాజిక సేవలను అందించిన గొప్ప సంఘసంస్కర్తల వేషధారణలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సిఐ అశోక్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. నేటి బాలలే భారత నిర్మాతలు, బాలల బంగారు భవిష్యత్తు విద్యతోనే సాధ్యం, మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య ఒక్కటే, నినాదాలతో 150 మీటర్ల జాతీయ జెండాను తీసుకుని పట్టణ పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. చిన్న పెద్ద ప్రతి ఒక్కరికి చిన్నారుల వేషధారణలు,, ర్యాలీ చూపరులకు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సయ్యద్ దూద్ భాష, ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్, పర్యవేక్షకులు భీమేష్ ,రాజు, జయలక్ష్మి, ఉపాధ్యాయులు ఈరన్న ,శీను ,శిరీష , రామలక్ష్మి, ముంతాజ్ పాల్గొన్నారు.





జాతీయ నేతల వేషధారణలో విద్యార్థులు, ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి ,
కర్నూలు పార్లమెంట్ తెలుగు మహిళా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ

# ఎంఎస్ఎంఈ పార్క్ స్థాపనతో యువతకు ఉపాధి అవకాశాలు


## హనుమాపురం వద్ద ఎంఎస్ఎంఈ పార్క్‌కు పర్చువల్‌గా సీఎం శంకుస్థాపన.. మంత్రాలయం సొసైటీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి.. టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి ..

**పెద్దకడబూరు, నవంబర్ 11 :**

ఎంఎస్ఎంఈ పార్క్ స్థాపనతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం లభిస్తుందని మంత్రాలయం సొసైటీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పెద్దకడబూరు మండల పరిధిలోని హనుమాపురం గ్రామ సమీపంలో ఉన్న నలంద డిగ్రీ కాలేజీ పక్కన ఉన్న సర్వే నెంబర్ 1161లో 31.19 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్క్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ ద్వారా శంకుస్థాపన కార్యక్రమం తహసీల్దార్ గీతా ప్రియదర్శిని ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మంత్రాలయం నియోజకవర్గం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఎంఎస్ఎంఈ పార్క్ నిర్మాణంతో స్థానిక ఆర్థిక వ్యవస్థకు నూతన ఊపు తీసుకువస్తుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రాభివృద్ధి విజనరీ సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు మండల తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీవో ప్రభావతి దేవి, డిప్యూటీ ఎంపీడీవో జయరాముడు, ఆర్ఐ జెర్మియా, కర్నూలు పార్లమెంట్ తెలుగు మహిళా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ, టీడీపీ సీనియర్ నాయకులు బసలదొడ్డి ఈరన్న, టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున, టీడీపీ మండల ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొట్రు రామాంజనేయులు, టీడీపీ బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు అధ్యక్షులు మల్లికార్జున, పెద్దకడబూరు సొసైటీ అధ్యక్షులు మీ సేవ ఆంజనేయులు, చిన్నతుంబళం సొసైటీ అధ్యక్షులు కందనాతి నరసప్ప, టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీలు మునెప్ప, గోనుమాను నరసన్న, ముక్కన్న, బూత్ ఇన్ చార్జ్ తలారి అంజీ, క్లస్టర్ ఇన్ చార్జ్ మురళి, టీడీపీ నాయకులు వీరేష్ గౌడ్, బీపీ ఈరన్న, రాజశేఖర్, రంగన్న, సొంటెన్న, మల్ధకల్, శివ, హనుమంతు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ ఛైర్మన్ రామకృష్ణారెడ్డి



టీడీపీ నేత రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం. ఎంఎస్ఎంఈ పార్క్ శంకుస్థాపనకు హాజరైన ప్రజలు



మాట్లాడుతున్న ఏవో సుచరిత

# రైతు సేవా కేంద్రంలో అందుబాటులో రాయితీ శెనగ విత్తనాలు

## ఏవో సుచరిత..

**పెద్దకడబూరు, నవంబర్ 11:**

రబీ సీజన్ లో సాగు చేసుకోవడానికి రైతులకు అవరమయ్యే శనగ విత్తనాలు పెద్దకడబూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రం నందు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారిణి సుచరిత మంగళవారం తెలిపారు. శనగ విత్తనాలు 25 శాతం రాయితీతో ప్రభుత్వం రైతులకు అందజేస్తుందన్నారు. శనగ విత్తనాలు క్వింటా ధర రూ.7,800 ఉండగా 25 శాతం రాయితీ రూ.1950 పోనూ రైతు రూ.5,850 చెల్లించాలని సూచించారు. శనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జెసిబితో పనులు చేయిస్తున్న
వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి

# జంగల్ కాలనీలో డ్రైనేజ్, గ్రావెల్ పనులు

**కౌతాళం, నవంబర్, 11:**

మండలం కేంద్రంలోని జంగల్ కాలనీలో డ్రైనేజ్, గ్రావైట్ పనులను వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి ప్రారంభించారు.
ఎమ్మెల్యే వై బాల నాగిరెడ్డి సహకారంతో కౌతాళం మండల నేత దేశాయ్ ప్రహ్లాద ఆచారి ఆదేశాల మేరకు ఎంపిపి నిధులతో జంగల్ కాలనీలో డ్రైనేజ్, గ్రావెల్ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌతాళం సర్పంచ్ పాల్ దినకర్, ఎంపిటిసి మూకన్న, కార్యకర్తలు జంబయ్య రాజు, ఈరన్న, సోషల్ మీడియా కన్వీనర్ ఖాదర్ లింగ, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



జెసిబితో పనులు చేయిస్తున్న
వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

## ఎంపీపీ ఈరన్న..

**అమరాపురం, నవంబర్ 11:**

మండలంలో అధికారులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన ప్రారంభమైనది. ఈ సందర్భంగా ఎంపీపీ ఈరన్న మాట్లాడుతూ. మండల స్థాయి అధికారులు శాఖల వారీగా తమ నివేదికలను చదివి వినిపించాలని కోరారు. వ్యవసాయ అధికారి మంజునాథ్ మాట్లాడుతూ. వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న వాటిని వివరించారు. సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభమవుతుందని బోరు బావుల క్రింద వేరుశనగ పంట సాగు చేసే వారికి సబ్సిడీ తో వేరుశెనగ కాయలు అందించాలని కోరారు. విద్యుత్ శాఖ ఏ.ఈ. సిద్దేశ్వర మాట్లాడుతూ సకాలంలో విద్యుత్తును సరఫరా చేస్తున్నట్లు వారు తెలిపారు సభ్యులు మాట్లాడుతూ కరెంట్ బిల్లులు అధికంగా వస్తున్నాయని తెలిపారు. ఏపిఎం ముత్యాలప్ప మాట్లాడుతూ మహిళా సంఘాలకు అందిస్తున్న రుణాలు తదితర వాటిని వివరించారు. మండల విద్యాశాఖ అధికారి వెంకటరమణ నాయక్ మాట్లాడుతూ విద్యాశాఖ గురించి వివరించారు. ఐ.సి.డి ఎస్., హోర్ద్ డబ్ల్యూ ఎస్, రెవిన్యూ, పంచాయతీ శాఖ, తదితర వాటి గురించి, ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ఎంపీపీ ఈరన్న మాట్లాడుతూ. సచివాలయ అధికారుల నుంచి మండల స్థాయి అధికారులు ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు గణేష్, ఏ.ఐ.సీ.సీ. డైరెక్టర్ రామకృష్ణ, ఎంపీడీవో రామారావు ,తాసిల్దార్ లక్ష్మీనరసింహం, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి జెడ్పిటిసి స్వరక్క నరసింహమూర్తి, ఎంపీటీసీ నారాయణ, హనుమంతరాయప్ప, ఓంకార స్వామి, కోఆప్షన్ నెంబర్ రసూల్ భాషా, ఎస్సీ హాస్టల్ వార్డెన్ మాధవి, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్, ఈరన్న, నరేష్, ప్రాథమిక వైద్యాధికారి, ఎన్ ఆర్ జి ఎస్ ఎపిఓ శివన్న తదితర అధికారులు పాల్గొన్నారు. మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, ఏఐసీసీ డైరెక్టర్ రామకృష్ణ వీరికి శాలువా లు, పూలమాలలతో సన్మానం చేశారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఈరన్న



మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, ఏఐసీసీ డైరెక్టర్ రామకృష్ణ, వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ ఈరన్న.




సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం ముత్యాలప్ప. సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు

# విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నతస్థాయికి

## ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్ ..

**పెద్దపప్పూరు, నవంబర్ 11:**

కష్టపడి చదివితే పై స్థాయికి ఎదగవచ్చని పెద్దపప్పూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్ వివరించారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమరిని చదివిస్తున్నారని వారి ఆశలను ఒమ్ము చేయకుండా కష్టపడి వారి ఆశలను నెరవేర్చడంతో పాటు ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు పేరు తేవాలని సూచించారు



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్. పాల్గొన్న విద్యార్థులు

# తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ


## ప్రజా గ్రీవెన్స్ వినతులపై విచారణ.. సబ్ కలెక్టర్ టి. అజయ్ కుమార్ ..

**పెద్దకడబూరు, నవంబర్ 11 :**

పెద్దకడబూరులోని మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆదోని సబ్ కలెక్టర్ టి. అజయ్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఆదోని సబ్ కలెక్టర్ గా టి. అజయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా పెద్దకడబూరు మండల తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీకి రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అలాగే ప్రజా సమస్యల పరిష్కారం వేదికకు వచ్చిన వినతులపై విచారణ చేపట్టారు. అర్జీదారులను ఒక్కరిగా పిలిచి తహసీల్దార్ గీతా ప్రియదర్శిని సమక్షంలోనే విచారించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ప్రజా గ్రీవెన్స్ కు, కార్యాలయానికి ప్రజల నుంచి వచ్చే వినతులపై విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఏ ఒక్కరూ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని తెలిపారు. అలాగే రీ సర్వేలో దొరలిన తప్పులను సరిచేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధులను నిర్వహించాలని ఆదేశించారు. సమయపాలన పాటిస్తూ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మండలంలోని వివిధ గ్రామాలలో రేషన్ పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ లలిత కుమారి, ఆర్ఐ జెర్మియా, మండల సర్వేయర్ తేజస్విని, ఏఎస్ఓ వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వీఆర్వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ టి. అజయ్ కుమార్



ప్రజా గ్రీవెన్స్‌కు వచ్చిన వినతులపై విచారిస్తున్న సబ్ కలెక్టర్ టి. అజయ్ కుమార్



మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసిన యువ నేత వరకూటి నవీన్

# వైయస్ జగన్‌తో యువనేత వరకూటి నవీన్ భేటీ

**రాయదుర్గం, నవంబర్ 11**

రాయదుర్గం నియోజకవర్గం లో తాజా రాజకీయ పరిణామాలపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని మంగళవారం అమరావతి లో క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆ పార్టీ యువ నేత వరకూటి నవీన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా రాయదుర్గం అభివృద్ధి, పార్టీ బలోపేతం, కార్యకర్తల సమస్యలు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికి వివరించినట్లు ఆయన తెలిపారు. ప్రజలతో మరింత సన్నిహితంగా ఉండటానికి తీసుకోవలసిన కార్యక్రమాలపై వైయస్ జగన్మోహన్ రెడ్డి గారికి ఒక సమగ్ర నివేదికను అందించినట్లు పార్టీ యువ నేత వరకూటి నవీన్ తెలిపారు. ముఖ్యంగా యువతను రాజకీయాల్లో చురుకుగా వైఎస్ఆర్ పార్టీతో భాగస్వామ్యం చేయించేందుకు వైయస్ జగన్మోహన్ రెడ్డి సూచనలు ఇచ్చినట్లు వరకూటి నవీన్ తెలిపారు.



వయోజన వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# వయోజన విద్య వలంటీర్లకు అవగాహన

**గుత్తి, నవంబర్ 11:**

గుత్తి మండలంలోని వయోజనులకు రాత్రి పూట చదువు చెప్పేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సదావకాశాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కమీషనర్ బి.జబ్బార్ మియా శిక్షణ పొందుతున్న విద్యా వలంటీర్లను కోరారు. ఈ కార్యక్రమం యొక్క ఉద్దేశ్యం,శిక్షణ, ప్రయోజనాలను వయోజన విద్య సూపర్ వైజర్ శ్రీధర్ , మెప్మా టి.యం.సి శ్రీనివాసరెడ్డి , మండల మహిళా సమాఖ్య రూరల్ ఏ.పి.యం అరుణ కుమారి , సి.ఓ లు చంద్ర శేఖర్ , షరీఫ్ , సి.సి లు నాగరాజు రామలింగం, మీనా , రంగనాయకులు, మెప్మా ఆర్.పి లు, వి.ఓ.ఏ లు, వాలంటీర్లు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా

# సిలిండర్ పేలి వ్యక్తి మృతి

**అనంతపురం రూరల్, నవంబర్ 11:**

నగరంలోని తపోవనంలో చిన్న సిలిండర్ పేలి జిలాన్ బాష మృతి చెందాడు. తపోవనంలో రిటైర్డ్ ఎస్ఐ మహబూబ్ బాషా ఇంటిని బాడుగకు తీసుకుని రజకనగర్‌కు చెందిన వెంకటకృష్ణ ఉంటున్నాడు. ఇదే ఇంటిలో మోనో అమ్మోనియం ఫాస్ఫేట్ సిలిండర్లను నిల్వ చేసిగుంతకల్లు పట్టణానికి చెందిన జిలాన్ బాష అమ్ముతున్నాడు. చిన్న సిలిండర్లలో ఈ రసాయనాన్ని నింపుతున్న క్రమంలో సిలిండర్ పేలి జిలాన్ బాషా మృతి చెందాడు.

# పక్కాగా మాన్యం భూముల సమాచారం

## డిపి వరద కిషోర్ రెడ్డి ..

**ముద్దనూరు, నవంబర్ 11:**

దేవాలయ యాన్యం భూముల సమాచారాన్ని పక్కాగా సేకరించాలని డిపి వరద కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా అధికారుల,స్థానిక తాసిల్దార్ ఆదేశానుసారం, స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలోడిప్యూటీ తాసిల్దార్ వరద కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో వీఆర్వోలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తాసిల్దార్ వరద కిషోర్ రెడ్డి మాట్లాడుతూ వీఆర్వోలు భూమి రికార్డులను పక్కాగా సేకరించాలని అన్నారు. అలాగే రీసర్వే లో గ్రామ సరిహద్దులను గుర్తిస్తూ, ప్రతి రైతు వారి భూమి హద్దులను చూపేందుకు గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి వారికి తెలపాలన్నారు. అలాగే మాన్యాలపై పక్కాగా దృష్టి పెట్టి దేవుని మాన్యాలు, కుల ఇనాం భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. అలాగే (డీ.కే.టీ) ప్రభుత్వం పేదలకు పంచిన భూముల క్రయవిక్రయాలపై దృష్టి మళ్లించి వాటి సమాచారాన్ని కూడా సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు కార్యాలయం సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిపి వరద కిషోర్ రెడ్డి

# వ్యవసాయ నిపుణులు సూచించిన మేరకే క్రిమిసంహారక మందులు వాడాలి

## డాట్ కోఆర్డినేటర్ విష్ణుప్రియ.. ఏ,ఓ వెంకట క్రిష్ణారెడ్డి ..

**ముద్దనూరు, నవంబర్ 11**

వ్యవసాయ నిపుణులు సూచించిన మేరకే పొలంలో క్రిమిసంహారిక మందులు వాడాలని జిల్లా డాట్ సెంటర్ కోఆర్డినేటర్ విష్ణుప్రియ, మండల వ్యవసాయ అధికారి మారెడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొడవలి సోంపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ విష్ణుప్రియ మాట్లాడుతూ రైతులు కంది పంటలో మొగ్గ దశలో వేప నూనె 5 యమ్ యల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి అని తెలిపారు. క్లోరి పైరి పాస్ 2 యంయల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి అని తెలిపారు.అవసరాన్ని బట్టి క్రిమిసంహారక మందులు పిచికారి చేయాలి అని తెలిపారు. అనంతరం వ్యవసాయ అధికారి వెంకట క్రిష్ణారెడ్డి



పొలంబడి నిర్వహిస్తున్న డాట్ కోఆర్డినేటర్ విష్ణుప్రియ, ఏ,ఓ వెంకట క్రిష్ణారెడ్డి



రైతులకు సూచనలు ఇస్తున్న డాట్ కోఆర్డినేటర్ విష్ణుప్రియ, ఏ,ఓ వెంకట క్రిష్ణారెడ్డి

మాట్లాడుతూ రైతులు రభిలో సాగు చేసిన పంటలను యాప్ అందుబాటులో కి వచ్చిన వెంటనే తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలి అన్నారు.అలాగే ఎరువులు,పురుగు మందులు,విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా నగదు బిల్లు తీసుకోవాలి అన్నారు.అలాగే లైసెన్స్ కలిగిన డీలర్లు దగ్గర మాత్రమే కొనుగోలు చేయాలి అని సూచించారు.గ్రామాల్లో ఎవరైనా అనుమతి లేకుండా పురుగు మందులు,విత్తనాలు విక్రయిస్తే తప్పకుండా అటువంటి వారి పైన సమాచారం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు లక్ష్మీ సింధూర, వెటర్నరీ అసిస్టెంట్ ధరణి గ్రామ రైతులు, గ్రామ నౌకరు గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## ఏ,డి వాసా శ్రీనివాస..

**ముద్దనూరు, నవంబర్ 11:**

వర్షాకాలం శీతాకాలం పశువులకు వ్యాపించే వ్యాధులపై పశువుల రైతులను,పశు వైద్య అధికారులు,సిబ్బంది అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పించాలని పశువైద్యా అడిషనల్ డైరెక్టర్ వాసా శ్రీనివాస పేర్కొన్నారు. స్థానిక పశు వైద్య కార్యాలయంలో మంగళవారం ఆయన సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు.అలాగే ప్రతి వైద్య సిబ్బంది గ్రామాల్లో



సిబ్బందికి టీకాలు అందిస్తున్న పశువైద్య శాఖ అడిషనల్ డైరెక్టర్ వాసా శ్రీనివాస



మాట్లాడుతున్న పశువైద్య శాఖ అడిషనల్ డైరెక్టర్ వాసా శ్రీనివాస

పర్యటిస్తూ సమాచారాన్ని తెలుసుకుంటూ ఎలాంటి సమస్యలు లేకుండా ఇచ్చిన టార్గెట్స్ పూర్తి చేయాలని అన్నారు. అనంతరం టీకాలను వారి వారి గ్రామాలకు తీసుకుని పోవడానికి, పశువులకు వారి ఇంటి వద్దే టీకాలు వేయడానికి అనువుగా పశు వైద్య సిబ్బందికి వాక్సిన్ క్యారియర్ బాక్స్ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో లో కొత్తపల్లి పశు వైద్యాధికారిణి డాక్టర్ భారతి, జే వి ఓ శకుంతలమ్మ, ఎల్ ఎస్ ఏ సూర్య బాబు, అనిమల్ హస్బెంద్రి అసిస్టెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్ మారుతీ శివ, గోపాల మిత్రలు పాల్గొన్నారు.



వాహనచోధకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ దస్తగిరి

# రహదారుల భద్రతా నియమాలను పాటించండి సురక్షితంగా ఇంటికి చేరండి

## సిఐ దస్తగిరి..

**ముద్దనూరు, నవంబర్ 11:**

జాతీయ రహదారుల భద్రత నియమాలను పాటించి సురక్షితంగా వాహన చోదకులు ఇంటికి చేరాలని సీఐ దస్తగిరి పేర్కొన్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడ లోని కడప తాడిపత్రి జాతీయ రహదారిపై మంగళవారం సీఐ దస్తగిరి తన సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా వాహనచోదకులతో ఆయన మాట్లాడుతూ మద్యం, ఇతరత్రా మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపకూడదన్నారు. అలాగే రాత్రి సమయంలో వాహనాల రాకపోకల విషయంలో ఎదురుగా వస్తున్న వాహన లైటింగ్ ను గమనిస్తూ జాగ్రత్తగా మీరు సైడుకు వెళ్లేందుకు దారి అనుకూలంగా ఉందో లేదో అని గమనిస్తూ ప్రయాణించాలన్నారు. అలాగే రాత్రి పూట నిద్ర వస్తున్నట్లయితే కొద్దిసేపు సురక్షితమైన ప్రాంతంలో ఆగి విశ్రాంతి తీసుకుని, తిరిగి ప్రయాణం చేసి సురక్షితంగా గమ్యం చేరుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై కూడా అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి మోసాలు జరిగిన సంబంధిత పోలీస్ స్టేషన్, సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.



చిత్తూరు పిజిఆర్ఎస్ వద్ద రామాపురం తండా గ్రామస్తులు

# రెండు పంచాయతీలుగా ననియాల తండా

**రామకుప్పం, నవంబర్ 11:**

మండలంలోని ననియాలతండా గ్రామ పంచాయతీని రెండుగా విభజించే ప్రక్రియను 15రోజుల్లోపు పూర్తిచే యాలని కలెక్టరు సుమిత్ కుమార్ జిల్లా పంచాయతీ అధికారులకు ఆదే శించారు. రామాపురంతండా వాసులు తెలిపిన వివరాల మేరకు ననియాలతండా, రామాపురం తండాలను కలిపి 2019లో రాష్ట్ర ప్రభుత్వం ననియాలతండా పంచాయతీని ఏర్పాటు చేసింది. రెండు గ్రామాల మధ్య సుమారు 8కిలోమీటర్ల రూరం ఉండటంతో రామాపురంతండా వాసులు ప్రభుత్వ నిర్ణయం పై హైకోర్టును ఆశ్రయించారు. దీంతో 2020లో ఈ పంచాయతీ ఎన్నికలు కూడా జరగలేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఆగస్టులో హైకోర్టు తీర్పును వెలువరించింది. ననియాల తండా, రామాపురంతండాలను వేర్వేరు పంచాయతీలుగా ఏర్పాటు చే యాలని పంచాయతీరాజ్ ప్రిన్సిపల్సెక్రటరీ, కమీషనర్, జిల్లా కలెక్టరు, జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాల అమలులో జాప్యం జరుగుతుండటంతో గ్రామస్థులు సోమవారం పీజీఆర్ఎస్ కు హాజరై కలెక్టరకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించి కలెక్టరు 15రోజుల్లోకి ననియాలతండా, రామపురంతండాల ను వేర్వేరు పంచాయతీలుగా విభజించే ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు.

# కౌశల్ పరీక్షల్లో జిల్లా స్థాయికి విద్యార్థుల ఎంపిక

**రామకుప్పం, నవంబర్ 11:**

మండలంలోని హొనిగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కౌశల్ పరీక్షల్లో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఆదిశేషయ్య తెలిపారు. ఈ సందర్భంగా పదవ తరగతి చదువుతున్న కార్తీక్, 9వ తరగతి చదువుతున్న నవీన, ఉదయశ్రీలు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు, స్థానిక నేతలు విద్యార్థులను విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ రెస్కో డైరెక్టర్ రామ్మూర్తి, ఎస్ఎంసి చైర్మన్ బీరప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు ,నేతలు

# కేజీబీవీ విద్యార్థునులకు కంటి పరీక్షలు

## వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన .. వైద్యాధికారి డాక్టర్ కార్తీక్ కుమార్ రెడ్డి..

**బెళుగుప్ప, నవంబర్ 11:**

బెళుగుప్పలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం ( కేజీబీవీ)లో మంగళవారం మండల వైద్యాధికారి డాక్టర్ కార్తీ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ముందుగా డాక్టర్ కార్తీక్ కుమార్ రెడ్డి, ఎస్ఓ నాగరత్నబాయి విద్యార్థినిలతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశు భ్రతను పాటించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతోనే ఆరోగ్యంగా ఉండగలుగుతారన్నారు. అలాగే కళ్ళను కూడా జాగ్రత్తగా



విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కార్తీక్ కుమార్ రెడ్డి, వైద్య సిబ్బంది



బెళుగుప్ప కేజీబీవీలో వ్యక్తిగత పరిశుభ్రతతపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కార్తీక్ కుమార్ రెడ్డి, ఎస్ఓ నాగరత్నబాయి

చూసుకోవాలన్నారు. ప్రభుత్వము పౌష్టికాహారాన్ని అందిస్తుందని కచ్చితంగా ప్రతి విద్యార్థిని ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యపై శ్రద్ధ కలుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు కంటి పరీక్షల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 280 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 35 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. వీరికి రెండు నెలల తర్వాత ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ కార్తీక్ కుమార్ రెడ్డి, సిహెచ్ఓ పద్మావతి, పీహెచ్ఎన్ సరోజమ్మ, సూపర్వైజర్ వెంకటరమణ, ఏఎన్ఎం రాధమ్మ, కన్యాకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ వైర్లు తగిలి బూడిదైన మొక్కజొన్న గడ్డి

## బ్రాహ్మణపల్లెలో తప్పిన భారీ ప్రమాదం.. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న గ్రామస్తులు...

**బెళుగుప్ప, నవంబర్ 11:**

గ్రామంలో కొన్ని విద్యుత్ స్తంభాలు దెబ్బతిని, విద్యుత్ తీగలు క్రిందకు వేలాడుతున్నాయని పలుమార్లు అధికారులకు తెలిపిన పట్టించుకోకపోవడంతోనే నేడు విద్యుత్ వైర్లు తగిలి మొక్కజొన్న గడ్డి మొత్తం బూడిదైందని, పెను ప్రమాదం తప్పిందని బ్రాహ్మణపల్లి గ్రామస్తులు పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే బెళుగుప్ప మండలం పరిధిలోని బ్రాహ్మణపల్లి



మంటలను ఆర్పివేస్తున్న కాలనీవాసులు



బ్రాహ్మణపల్లి వద్ద విద్యుత్ వైర్లు తగిలి కాలి బూడిదైన మొక్కజొన్న గడ్డి

లో మంగళవారం గ్రామానికి చెందిన రైతు కృష్ణస్వామి మొక్కజొన్న గడ్డిని తోట నుంచి ట్రాక్టర్ లో తీసుకొని గ్రామానికి వస్తుండగా ప్రమాదవశాత్తు వేలాడుతున్న విద్యుత్ వైర్లు మొక్కజొన్న గడ్డికి తగిలి మంటలు చెలరేగాయి, దీంతో కాలనీవాసులు వెంటనే మొక్కజొన్న గడ్డి ని క్రిందకు పడేయగా అప్పటికే పూర్తిగా కాలి బూడిద అయ్యింది. కేవలం మొక్కజొన్న గడ్డి మాత్రమే ఖాళీ బూడిద కావడంతో ఊపిరి పీల్చుకున్నారు పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు పేర్కొన్నారు. గత సంవత్సరం గ్రామంలో విద్యుత్ వైర్లు క్రిందకు వేలాడుతున్నాయని అధికారులకు గ్రీవెన్స్ లో కూడా ఇవ్వడం జరిగిందని, అయినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రామకోటి కాలనీ ప్రజలు

## రేషన్ షాపు అందుబాటులో ఉంచాలని ఆందోళన

**పెద్దపప్పూరు, నవంబర్ 11:**
రేషన్ షాపును అందుబాటులో ఉంచాలని పెద్దపప్పూరు రామకోటి కాలనీ ప్రజలు ఆందోళన చేపట్టారు. చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్దపప్పూరు తాసిల్దార్ కార్యాలయం వద్ద దాదాపు ఒకటిన్నర గంటసేపు ఆందోళన చేపట్టారు. రామకోటి కాలనీలో రేషన్ షాపు డీలరు కాలనీకి అందుబాటులో కాకుండా కిలో మీటర్ దూరంగా ఊరికి చివర ఏర్పాటుచేసి బియ్యం వేస్తున్నారన్నారు. స్టోర్ అందుబాటులో ఉంచాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన సిపిఐ పెద్దపప్పూరు మండల కార్యదర్శి చింతా పురుషోత్తం వారు మాట్లాడుతూ స్టోర్ నడుపుతున్న దళారిపై తక్షణమే చర్య తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అందుబాటులోనే స్టోర్ బియ్యం ఉంచాలని లేని పక్షంలో వచ్చే ఒకటో తారీఖున ఆందోళన చేస్తామని అన్నారు. అలాగే పెద్దపప్పూరు మండల వ్యాప్తంగా ఉన్న స్టోర్ డీలర్లు బియ్యం రెండు కేజీలు తక్కువ తూకంతో వేస్తున్నారని, ఇదేమిటని ప్రజలు అడిగితే వెవరికైనా చెప్పుకోండి అంటూ బెదిరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింత సాంబశివుడు, అరుణోదయ బద్దల రమణ, గుండా సుబ్రమణ్యం పాల్గొన్నారు.




జాతీయ నేతల జయంతి వేడుకలు నిర్వహిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

## పెన్షనర్ల భవనంలో మౌలానా అబుల్ కలాం జయంతి

**గుత్తి, నవంబర్ 11:**
గుత్తి పట్టణంలో తొలి విద్యా శాఖ మంత్రి మౌలాన అబుల్ కలాం 137వ జయంతి కార్యక్రమాన్ని పెన్షన ర్స్ అసోసియేషన్ కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదట విద్యా శాఖ మంత్రి మౌలాన అబుల్ కలాం చిత్ర పటాలకు కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, జాయింట్ సెక్రటరీ లక్ష్మి నారాయణ రెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు మాట్లాడుతూ ఈయన మక్కాలో పుట్టారు."మౌలాన "అంటే ముస్లిం మత గ్రంథాలను అవపోసిన పట్టి నవాడు అని అర్థం.ఈయన ఖురాన్ హదీస్ మొత్తం గ్రంథాలను అధ్యయనం చేశాడు. ఈయన పాఠశాల కు వెళ్ళలేదు. ఇంటిలోనే ట్యూషన్ చేప్పించు కుని పర్షియన్, అరబిక్,ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషలు నేర్చుకున్నాడు. లక్షల మంది హిందువుల మృతి కి కారణ మైన ఖిలా ఫత్ ఉద్యమాన్ని వీరు సమర్థించారు. ఆలాంటి ఈయన హిందూ మెజారిటీ భారత దేశమైన మొట్ట మొదటి విద్యా శాఖ మంత్రి అయ్యారు.ఇతను మన దేశం మన ధర్మం కోసం త్యాగాలు చేసిన పండితులు, వీరులు, రాజుల చరిత్ర ను మన పాఠ్య పుస్తకాలలో చేర్చలేదు అని కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, జాయింట్ సెక్రటరీ లక్ష్మి నారాయణ రెడ్డి, నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, నారాయణ శెట్టి, దేవదాసు, సంపత్, శామ్యూల్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.




పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

## గేట్స్‌లో జాతీయ విద్యా దినోత్సవం

### విద్యా స్ఫూర్తి ర్యాలీ..

**గుత్తి, నవంబర్ 11:**
జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా గుత్తి పట్టణంలో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోనీ హోండా షోరూమ్ నుండి రాజీవ్ గాంధీ కూడలి వరకు వైభవంగా సాగింది. వందలాది గేట్స్ విద్యార్థులు విద్య ప్రాముఖ్యతను తెలియజేసే నినాదాలు, ప్రముఖ విద్యావేత్త మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ గారి సూక్తులతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. గేట్స్ కళాశాల వ్యవస్థాపకులు దివంగత వీకే సుధీర్ రెడ్డి వర్ధంతి కూడా కావడంతో వారి ఆత్మస్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ ఆయన జీవిత మూడు విలువలు క్రమ శిక్షణ,నిబద్ధత మరియు దృఢసంకల్పం అనేవి ప్రధానంగా ప్రదర్శించారు.ఈ మూడు విలువలను ప్రతిబింబించేలా ర్యాలీకి త్రీడీ వాక్ అనే పేరు పెట్టారు. అధ్యాపకులు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ వీకే.సుధీర్ రెడ్డి ఆలోచనలు, ఆచరణలు మా విద్యార్థులకు ఎల్లప్పుడూ మార్గదర్శకం. విద్య అంటే కేవలం పుస్తకాల జ్ఞానం కాదు, అది క్రమ శిక్షణ, నిబద్ధత మరియు ధృఢ సంకల్పం యొక్క కలయిక అని పేర్కొన్నారు. విద్య ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ, యువతలో స్ఫూర్తిని నింపిన ఈ "త్రీడీ వాక్" గుత్తి పట్టణంలో విశేష స్పందన మరియు ప్రత్యేక గుర్తింపును ఇచ్చింది. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వి కే శ్రీవాణి, ఎండి రఘునాథరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్,ఏవో ఇంతియాజ్ బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు




పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

## 15 రోజుల్లో లీజుల సరిహద్దు రీ సర్వే పూర్తి

### రాష్ట్ర సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ ఆర్.కురుమనాత్ ..

**డి హిరేహాల్, నవంబర్ 11:**
వివాదాస్పద ఓబులాపురం మైనింగ్ ప్రాంతంలో మైనింగ్ లీజుల సరిహద్దు రీ సర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, ఈ సర్వే 15 రోజుల్లో పూర్తి చేస్తామని రాష్ట్ర సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ ఆర్.కురుమనాత్ స్పష్టం చేశారు. మంగళవారం సుప్రీంకోర్టు నియమించిన సర్వే బృందం అధికారులతో కలిసి ఓబులాపురం మైనింగ్ ప్రాంతంలోని ఉన్న ఐదు మైనింగ్ లీజు ప్రాంతాలు అలాగే హెచ్ సిద్దాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఉన్న మరొక గనుల లీజు ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ముందుగా ఓబులాపురం గ్రామ పంచాయతీలో ఉన్న ఓబులాపురం మైనింగ్ కంపెనీకి చెందిన రెండు మైనింగ్ లీజు ప్రాంతాలు, బళ్లారి ఐరన్ ఓర్ కంపెనీకి చెందిన ఒక లీజు ప్రాంతం, వై మహాబలేశ్వరప్ప మైనింగ్ కంపెనీ లీజుల ప్రాంతాన్ని, అనంతపురం మైనింగ్ కంపెనీకి చెందిన మరో మైనింగ్ లీజ్ ప్రాంతాన్ని సర్వే బృందం అధికారులు పరిశీలించారు. లీజు మైనింగుల సరిహద్దు బౌండరీలు ఆంధ్ర కర్ణాటక సరిహద్దుల బౌండరీలను వారు పరిశీలించారు. అలాగే హెచ్ సిద్దాపురం హెచ్ ఎస్ తాండ గ్రామాల పరిధిలో ఉన్న అంతరం గంగమ్మ మైనింగ్ ప్రాంతాన్ని కూడా సర్వే బృందం



. ఓబులాపురం మైనింగ్ ప్రాంతంలో గనుల లీజుల సరిహద్దుల మ్యాపులను పరిశీలిస్తున్న సర్వే బృందం



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ ఆర్ కురుమనాథ్

అధికారులు పరిశీలించారు.
అనంతరం ఓబులాపురం మైనింగ్ ప్రాంతం లో ఉన్న సుంకులమ్మ దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సర్వే బృందం అధికారులు మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ ఆర్ కురుమనాత్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన డైరెక్షన్లో లీజుల సరిహద్దుల రీ సర్వేను చేస్తున్నామని ఆయన తెలిపారు. మైనింగ్ లీజుల ప్రాంతాలలో బౌండరీలు కచ్చితంగా ఉండేలా డ్రోన్ టెక్నాలజీతో రీ సర్వే జరుగుతుందని ఆయన అన్నారు. ఓబులాపురం మైనింగ్ ప్రాంతంలో ఉన్న ఆరు మైనింగ్ ప్రాంతాలలో అక్రమ మైనింగ్ జరిగిందని అలాగే లీజుల సరిహద్దు బౌండరీలు ధ్వంసం చేశారని ఫిర్యాదులు సుప్రీంకోర్టుకు చేరిన విషయం తెలిసిందే అని అన్నారు. ఓబులాపురం మైనింగ్ ప్రాంతంలో అక్రమ మైనింగ్ జరిగిందా? ప్లీజ్ బౌండరీలు ధ్వంసం అయ్యాయా గుర్తించి మళ్లీ రీసర్వ్ చేసి సరిహద్దు బౌండరీలు గుర్తించి నివేదికలు కోర్టుకు ఇవ్వాలని తెలిపినట్లు ఆయన తెలిపారు. గత వారం రోజుల నుండి ఓబులాపురం మైనింగ్ ప్రాంతంలో రీ సర్వే పనులు జరుగుతున్నాయని, సర్వే పూర్తి అయ్యాక సరిహద్దు బౌండరీలను ఖచ్చితమైన ప్రాంతంలో ఏర్పాటుచేసి సర్వే నివేదికలను త్వరలో సుప్రీంకోర్టుకు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస చౌదరి అనంతపురం జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు ఏడి రూప్ల రూప్లా నాయక్ తోపాటు సర్వే బృందం పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి నిర్మూలన అవగాహన పోస్టర్లు విడుదల

### డిపిఎమ్ఓ రామచంద్ర..

**యాడికి. నవంబర్ 11 :**
తాడిపత్రి రూరల్ పరిధిలోని చిక్కులూరు ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం డాక్టర్ లావణ్య ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు సిహెచ్ఒల కు లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపైన్ కార్యక్రమం నిర్వహించారు. కుష్టువ్యాధి నిర్మూలనపై సిబ్బంది ఇంటింటికి వెళ్లి పరీక్షించాలని తెలిపారు. అనంతరం కుష్టువ్యాధి నిర్మూలన పోస్టర్లను విడుదల చేశారు. యాడికి ప్రభుత్వ వైద్యశాలలో కుష్టు వ్యాధి నిర్మూలన పై డాక్టర్ సాయి సుమంత్ రెడ్డి. డిపిఎమ్ఓ రామచంద్ర. మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు. సూపర్వైజర్ రాంప్రసాద్ గౌడ్. సిబ్బంది మద్దిలేటి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిపిఎమ్ఓ రామచంద్ర మాట్లాడుతూ జీరో లెప్రసీ కేసులు, జీరో వికలాంగత్వం, లెప్రసీ కేసులపై వివక్ష చూపకుండా ఉండాలన్నారు. చర్మంపై రాగి రంగు లో మచ్చలు, ముఖం పాలిపోయి ఉండడం, స్వర్శ లేకుండా ఉండడం, వంటి లక్షణాలు కలిగి ఉంటే పిహెచ్‌సికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. యాడికి ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్ సాయి




యాడికి ప్రభుత్వ వైద్యశాలలో కుష్టు వ్యాధి నిర్మూలన పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు

సుమంత్ రెడ్డి. డిపిఎమ్ఓ రామచంద్ర. జుబేదా. శ్రీనివాసులు రాంప్రసాద్ గౌడ్. మద్దిలేటి తదితరులు కుష్టి వ్యాధి నిర్మూలన పోస్టర్ విడుదల చేశారు ఈ కార్యక్రమంలో సి హెచ్ ఒ హేమలత, ఎం పి హెచ్ ఈ ఓ లక్ష్మన్న ఎంపీహెచ్ఎస్ ( ఎం) ఎం. పీ నారాయణ, హేమలత, సి హెచ్ ఒ లు ఆరోగ్య కార్యకర్తలు, మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.




చుక్కులూరు ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్న డిపిఎమ్ఓ రామచంద్ర

## మహోన్నతుడు మౌలానా అబుల్ కలామ్ అజాద్

**పామిడి, నవంబర్ 11:**
భారత ప్రభుత్వంలో తొలి విద్యాశాఖ మంత్రిగా ప్రజాభ్యున్నతిని ఆకాంక్షిస్తూ అనేక సేవలను అందించిన మౌలానా అబుల్ కలామ్ అజాద్ మహోన్నతుడు అని పలువురు కొనియాడారు. మౌలానా అబుల్ కలామ్ అజాద్ జయంతోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించి జాతీయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని పదేళ్ళుగా జైలుశిక్ష అనుభవించిన మౌలానా అబుల్ కలామ్ అజాద్ భారత ప్రభుత్వంలో 11 ఏళ్ళు విద్యాశాఖ మంత్రిగా దేశాభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని తెలిపారు.
ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు బి.కే.రహీమ్, సిపిఐ నాయకులు రహీమ్, టిడిపి నాయకులు కొట్టం మాలిక్, బాబా ఫకృద్దీన్, మహమ్మద్ రఫీ, హుసేన్ పీర, దాదా ఖలంధర్, వైసీపీ నాయకులు అబూ



మౌలానా అబుల్ కలామ్ అజాద్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ముస్లిం సోదరులు.

సాలెహా, షేక్షావలి, మహబూబ్ బాషా, పాపులు జిలాన్, ఖిల్లా జామియా కార్యదర్శి చన్నవరం జాకీర్, ముఫ్తీ రషీద్, రియాజ్, మౌలానా ఇలియాస్, మౌలానా సాదిక్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## విజన్‌లో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

**యాడికి, నవంబర్ 11:**
యాడికి మండల కేంద్రంలోని విజన్ హైస్కూల్‌లో మంగళవారం భారత తొలి విద్యా శాఖా విద్యా మంత్రి శ్రీ "మౌలానా అబుల్ కలాం ఆజాద్" గారి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ విశ్వనాధ్ ఆయన జీవిత చరిత్రను ఉద్దేశించి ఆయన 1888 నవంబర్ 11న జన్మించి స్వీయ విద్యాభ్యాసం చేశారని, అనంతరం "ఆల్ హిలాల్" పత్రికను స్థాపించి ఎంతో మందిని స్వాతంత్ర సంగ్రామం లో పాల్గొనేలా ప్రేరణ కల్పించే కథనాలు రాశారని, ఆయన రచనలకు భయపడిన బ్రిటిష్ ప్రభుత్వం ఆ




మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయుల బృందం



విజన్ పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల బృందం చిన్నారులు

పత్రికను కలకత్తా నుండి బహిష్కరించారని,అలాగే ఆయన హిందూ ముస్లింల ఐక్యత కోసం పాటుపడ్డారు అని అలాగే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆయన మొదటి విద్యా శాఖా మంత్రి గా ఎన్నికైన తర్వాత భారత విద్యా వ్యవస్థ లో సమూల మార్పులు తెచ్చి అనేక కళాశాలలు, విశ్వ విద్యాలయాలు స్థాపించి ఎంతో మంది పేద విద్యార్తులకు ఉచిత ఉన్నత విద్యను అందించడంలో విశేష కృషి చేశారని.ఈ రోజు భారతీయులు ప్రతి దేశంలో మంచి ఉన్నత స్థానంలో ఉన్నారంటే విద్యారంగంలో ఆయన చేసిన గొప్ప సేవలే కారణం అని విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో విజన్ విద్యార్థులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి గ్రామోత్సవం

**పామిడి, నవంబర్ 11:**
శ్రీ అనఘా ఆత్రేయ దత్త పాదుకాక్షేత్రంలో శ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ, శ్రీ దత్తవిజయానందతీర్థ స్వామీజీ ఆశీస్సులతో మంగళవారం భక్తాదులు శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి గ్రామోత్సవంను నిర్వహించారు. శ్రీ మహాగణాధిపతి పూజ, శ్రీ అనఘా దత్త స్వామి అర్చన గురుపాదుకా పూజ గావించి శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి వారికి విశేష పంచామృతాభిషేకాన్ని చేపట్టి మహామంగళహారతి అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం శ్రీ ఆంజనేయస్వామి మాలధారణ భక్తాదులు శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి గ్రామోత్సవాన్ని చేపట్టగా ప్రజల తమ తమ ఇళ్ళ ముంగిటకే వచ్చిన స్వామి వారిని దర్శించుకుని పూజలు చేపడుతూ స్వామి వారి కృపను పాత్రులై తీర్థప్రసాదాలను స్వీకరించారు. శ్రీ ఆంజనేయస్వామి మాలధారణ భక్తాదులు స్వామి వారిని స్తుతిస్తూ ఆలపించిన గేయాలు భజన బృందం నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

## సుందర పుష్పాలంకరణలో శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి

**తాడిపత్రి, నవంబర్ 11:**
కార్తీక మాసం ఉత్సవాలలో భాగంగా 21వ రోజున మంగళవారం శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి సుందర పుష్పాలంకరణతో శోభిల్లారు. ఉదయం శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామికి క్షీరాభిషేకం, అభిషేకాలు గావించిన అనంతరం విశేష పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు.



సుందర పుష్పాలంకరణలో శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి

## వైకాపానేత ఓబుల్ రెడ్డిపై దాడి

### పరిస్థితి విషమం .

**తాడిపత్రి, నవంబర్ 11:**
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత ఆర్‌సీ ఓబుల్ రెడ్డిపై మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. దాడిలో తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలో పడి ఉన్న ఓబుల రెడ్డిని స్థానికులు చెబుతున్నారని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైసీపీ నేత, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ ఆర్‌సీ ఓబుల్ రెడ్డిపై గుర్తు తెలియని దుండగులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆయన తలకు, శరీరానికి తీవ్ర గాయాలవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది. రూరల్ పరిధిలో ఐశ్వర్య విల్లాస్ బైపాస్ సమీపంలో ఓబుల్ రెడ్డిపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. తీవ్ర గాయాలతో పడి ఉన్న ఆయనను గమనించిన స్థానికులు వెంటనే తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి మాజీ శాసనసభ్యులు కేతిరెడ్డి పెద్దారెడ్డి హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని ఓబుల్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. తాడిపత్రిలో రాజకీయ ప్రాధాన్యత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ దాడి వెనుక రాజకీయ కక్షలు ఉన్నాయా, వ్యక్తిగత కారణాలతో జరిగిందాయనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.



గాయపడిన ఓబుల్ రెడ్డిని అనంతపురం తరలిస్తున్న దృశ్యం

## రష్మిక మూవీ గర్ల్‌ఫ్రెండ్ సక్సెస్ మీట్

ముఖ్య అతిథిగా వస్తోన్న విజయ్

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో నటించిన సూపర్ హిట్ చిత్రం ది గర్ల్ ఫ్రెండ్ సినిమాకు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించగా.. దీక్షిత్ శెట్టి కథానాయకుడిగా నటించాడు. గీతా ఆర్ట్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. వీకెండ్‌తో కాకుండా వీక్ డేస్‌లో కూడా ఈ చిత్రానికి హౌస్ ఫుల్ బోర్డులు కనిపించాయి. అయితే ఈ సినిమా సాధించిన విజయం పట్ల చిత్రబృందం నవంబర్ 12న సక్సెస్ మీట్ నిర్వహించబోతుంది. ఈ సక్సెస్ మీట్‌కు ముఖ్య అతిథిగా స్టార్ నటుడు విజయ్ దేవరకొండ రాబోతున్నట్లు తెలుస్తుంది. దీంతో ఈ వేడుక మరింత గ్రాండ్‌గా ఉండబోతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ఎంగేజ్‌మెంట్ తర్వాత రష్మిక, విజయ్ ఒకేసారి వేదిక మీద కనిపించబోతుండటంతో ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గర్ల్ ఫ్రెండ్ సినిమా కథ విషయానికి వస్తే.. భూమా (రష్మిక మందన్న) పీజీ చేయడానికి హైదరాబాద్ లోని ఓ కాలేజ్ లో జాయిన్ అవుతుంది. అదే కాలేజ్ లో పీజీ చేయడానికి వచ్చిన విక్రమ్ (దీక్షిత్ శెట్టి) భుమాని చూసి ఇష్టపడతాడు. భూమా కూడా విక్రమ్ ని ఇష్టపడుతుంది. విక్రమ్ కి జెలసీ, పొసిస్సివెన్స్ ఎక్కువ. తనది పాత కాలం మనస్తత్వం. విక్రమ్ తో రోజులు గడుపుతున్నకొద్దీ భూమాకి కొన్ని విషయాలు అర్ధమవుతూ వస్తుంటాయి. రిలేషన్షిప్ లో ఓ చిన్న బ్రేక్ కావాలని అడుతుంది. ఆ తర్వాత ఏం జరిగింది? విక్రమ్ ఎలా రియాక్ట్ అయ్యాడు ? ఈ కథలో దుర్గా (అను ఇమ్మానుయేల్) పాత్ర ఏమిటి? చివరికి భూమా ఎలాంటి నిర్ణయం తీసుకుందనేది మిగతా కథ.




## బ్యాడ్ గర్ల్స్ మూవీ ఇది



ఇండస్ట్రీలో వివాదాస్పదమైన సినిమాలు చాలానే ఉన్నాయి. బ్యాడ్ గర్ల్ చిత్రంపై అక్కినేని కోడలు శోభితా ప్రశంసలు కురిపించింది. ప్రస్తుతం ఈ న్యూస్ నెట్టింట వైరల్ గా మారింది. అక్కినేని కోడలిని అంతగా మెప్పించిన సినిమా ఏది అంటే.. బ్యాడ్ గర్ల్ అంజలి శివరామన్ ప్రధాన పాత్రలో వర్ష భరత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం బ్యాడ్ గర్ల్. వెట్రిమారన్, అనురాగ్ కశ్యప్ నిర్మించిన ఈ సినిమా టీజర్ రిలీజ్ అయినప్పటి నుంచే వివాదాలను ఎదుర్కొంటుంది. ఒక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన అమ్మాయి.. తన యుక్త వయస్సులని లైంగిక కోరికల గురించి చెప్పడం, వాటిని తీర్చుకోవడానికి తహతహలాడడం లాంటివి చూపించడంతో బ్రాహ్మణ సంఘాలు మండిపడ్డాయి. ఈ సినిమాను బ్యాన్ చేయాలనీ డిమాండ్ చేశాయి. ఇక బ్యాడ్ గర్ల్ సినిమా సెప్టెంబర్ లో రిలీజ్ అయ్యి మిక్స్డ్ టాక్ ను అందుకుంది. వివాదం వలన ఎక్కువ పేరు తెచ్చుకోలేకపోయిన ఈ సినిమా ఈ నెల నుంచే జియో హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ అవుతుంది. సినిమా బావున్నా కూడా వివాదం అవుతుందేమో అన్న భయంతో ఎవరు కూడా ఈ చిప్తం÷-రపై స్పందించలేదు. తాజాగా అక్కినేని కోడలు శోభితా మాత్రం బ్యాడ్ గర్ల్ చిత్రం తనకు బాగా నచ్చిందని పోస్ట్ పెట్టింది.'బ్యాడ్ గర్ల్.. నన్ను నవ్వించింది.. కన్నీళ్లు పెట్టించింది. మంచి సినిమా చూసిన అనుభూతిని అందించింది. అందరూ చూడాల్సిన సినిమా.. ముఖ్యంగా అమ్మాయిలకు ఈ చిత్రాన్ని నేను సిఫార్సు చేస్తున్నాను. ఇది మనకోసం.. వర్ష భరత్ మరియు అంజలి శివరామన్ ను అభినందించాలి' అంటూ చెప్పుకొచ్చింది. దీంతో ఒక్కసారిగా ఈ సినిమాపై ఎక్కడలేని హైప్ వచ్చేసింది. మరి అక్కినేని కోడలి పోస్ట్ వలన ఈ సినిమా రాత మారుతుందేమో చూడాలి.

# సినిమా ప్రమోషన్‌లో రాజమౌళి స్టైలే వేరు




సినిమాను జనాల్లోకి తీసుకెళ్లడం ఓ ఆర్ట్. అది బాగా తెలిసిన వ్యక్తి రాజమౌళి. ఆయన పబ్లిసిటీ స్ట్రాటజీనే వేరు. ఆయన క్రియేటివ్ ఆలోచనలతో ఆ రీచ్ ఎక్కడికో వెళ్లిపోతుంది. అయితే పబ్లిసిటీలో కూడా రెగ్యులర్‌గా కాకుండా ఆయన కొత్త ఒరవడి తీసుకొస్తారాయన. ప్రస్తుతం మహేష్ బాబుతో చేస్తున్న 'ఎస్ఎస్ఎంబీ29' విషయంలో ఆయన థాట్స్ అన్ని భిన్నంగా ఉన్నాయి. మమూలుగా స్టార్ హీరోల సినిమాలంటే ఎంటైర్ మీడియా అక్కడే ఉంటుంది. ఆయా ఈవెంట్‌లను ఛానళ్లు అన్ని ప్రమోట్ చేస్తాయి. కానీ 15న జరగబోయే గ్లోబ్‌ట్రోట్ ఈవెంట్‌ను జక్కన్న ఎక్స్‌క్లూజివ్‌గా జియో, హాట్‌స్టార్‌కి ఇచ్చేశారు. అలాగే ఈ సినిమా అప్డేట్స్ విషయంలో కూడా కొత్త ఎత్తుగడను ఫాలో అవుతున్నారు. ముందు నుంచీ కూడా ఎలాంటి అప్‌డేట్ ఇవ్వకుండానే సినిమాకు విపరీతంగా హైప్ తీసుకొచ్చిన రాజమౌళి.. ఇప్పుడు ఏ అప్‌డేట్ లేకుండానే డైరెక్ట్‌గా కంటెంట్ మీడియాకు వదిలేస్తున్నారు. ఇందులో విలన్‌గా నటిస్తున్న పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్ లుక్ అందుకు ఉదాహరణ. ఆ లుక్ వచ్చేవరకు అది వస్తుందన్న సమాచారం కూడా లేదు.సోమవారం 'సంచారి' అనే పాటను విడుదల చేశారు. దీనిపై కూడా ముందస్తు సమాచారం ఏమీ లేదు. డైరెక్ట్ రిలీజ్ చేసేశారు. ఆ పాట వస్తుందని సినిమా సర్కిల్స్‌లోనే చాలా మందికి తెలీదు. ముందుగా పాట యాపిల్ మ్యూజిక్‌లో స్ట్రీమ్ అయింది, తర్వాత యూట్యూబ్‌లో దర్శనమిచ్చింది. కాకపోతే రిలీజ్ అయిన తర్వాత రావాల్సిన రీచ్ ఇప్పటికే వచ్చేసింది. మామూలుగా ఇలాంటి పాట వస్తుందంటే ఫస్ట్ సింగిల్ వస్తుందని, లేదా ఇంకేదో అప్‌డేట్ ఇస్తామని పోస్టర్ రూపంలో ముందుగా సమాచారం ఇస్తారు. ఏ సమయానికి వస్తుందో సమయం కూడా చెబుతారు. ఈ మధ్యన భారీ బ్జడెట్ చిత్రాలన్నీ చేసే పని ఇదే. కానీ రాజమౌళి తీరు చూస్తుంటే ఆ పాత పద్ధతికి స్వస్తి చెప్పినట్లు అర్ధమవుతుంది. ఈ సినిమాను జనాల్లోకి తీసుకెళ్లడానికి కొత్త పద్ధతి ఫాలో అవుతున్నట్లు తెలుస్తోంది.

## డింపుల్ హాయతికి కలసి వచ్చేనా

సునీల్ కుమార్ రెడ్డి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'గల్ఫ్'మూవీతో నాయికగా తెరంగేట్రమ్ చేసిన డింపుల్ హయతీ ఈ మధ్య కాలంలో తన నటనకంటే వివాదాస్పద అంశాలతోనే ఎక్కువగా వార్తల్లో నిలిచింది. 2023లో ఓ పోలీస్ ఆఫీసర్ తో తగవు పడిన విషయంలోనూ, కొద్ది నెలల క్రితం ఇంటి పనమ్మాయి ఇచ్చిన ఫిర్యాదుతోనూ డింపుల్ హయతీ, ఆమె భర్త విక్టర్ డేవిడ్ మీడియాలో కెక్కారు. తెలుగులో రెండేళ్ళ క్రితం గోపీచంద్ 'రామబాణం'సినిమాలో చివరిగా నటించిన డింపుల్ హయతీకి ఆ తర్వాత మరే సినిమాలోనూ ఛాన్స్ దక్కలేదు. అయితే తాజాగా మాస్ మహరాజా రవితేజ నటిస్తున్న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' లో ఆమె హీరోయిన్ గా నటిస్తోంది. డింపుల్ హయతీతో పాటు ఈ సినిమాలో ఆషికా రంగనాథ్ మరో హీరోయిన్. విశేషం ఏమంటే ఆషికా రంగనాథ్... రవితేజ సరసన నటించడం ఇదే మొదటిసారి కానీ డింపుల్ హయతీ గతంలో రవితేజతో 'ఖిలాడీ' (ఐఠత్గి÷జీటతి) మూవీలో నటించింది. ఆ సినిమాలో తన గ్లామర్ తో, డాన్స్ తో డింపుల్ ఆడియెన్స్ ను మెప్పించినా... సినిమా మాత్రం కమర్షియల్ గా సక్సెస్ కాలేదు. ఆ తర్వాత వచ్చిన 'రామబాణం' కూడా నిరాశకే గురిచేసింది. దాంతో ఇప్పుడు అమ్మడి ఆశలన్నీ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమా మీదనే ఉన్నాయి. సంక్రాంతి కానుకగా రాబోతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ ఒక వేళ హిట్ అయితే... డింపుల్ హయతీ మళ్ళీ ట్రాక్ లోకి వచ్చే ఆస్కారం ఉంటుంది. మరికొన్ని అవకాశాలు లభించి, కెరీర్ ఇంకొంతకాలంగా సాఫీగా సాగిపోతోంది. లేకపోతే ఇక కష్టమే. ఎందుకంటే... గడిచిన ఏడెనిమిదేళ్ళలో డింపుల్ తెలుగుతో పాటు తమిళ, హిందీ చిత్రాల్లో నటించింది. బట్ ఎందుకో అక్కడ కూడా తనదైన మార్క్ చూపించలేక పోయింది. సో... 'భక్త మహాశయులకు విజ్ఞప్తి' మూవీ డింపుల్ కెరీర్ కు లిట్మస్ టెస్ట్ అనుకోవాల్సి ఉంటుంది.




## పెద్దిలో రెహ్మాన్‌తో జానీ మాస్టర్



ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ ఇటీవల ఆస్కార్ విజేత, సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్‌తో కలిసి ఒక ఫొటో దిగిన విషయం తెలిసిందే. ఈ ఫొటోను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు జానీ. రామ్ చరణ్ నటిస్తున్న పెద్ది సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఈ ఘటన జరిగింది. అయితే జానీ ఈ ఫొటోను పంచుకున్న వెంటనే కొంతమంది నెటిజన్లు జానీ రీ ఎంట్రీ అదిరిపోయే విధంగా వుందని ప్రశంసిస్తున్నారు. పెద్ది సినిమాతో ఆతని క్రేజ్ మరింత పెరిగే అవకాశం వుందన్న చర్చలు జరగుతున్నాయి. పెద్ది ప్రమోషన్స్‌లో భాగంగా ఆస్కార్ అవార్డు గ్రహీత సంగీత దర్శకుడు ఏ ఆర్ రెహ్మాన్‌తో దిగిన ఫోటోను చూసి ఎప్పటికైనా జానీ మాస్టర్ ఆస్కార్ దక్కించుకుని విమర్శకుల నోళ్లు మూయించాలని ఆయన అభిమానులు పోస్టులు పెడుతున్నారు.. లైంగిక ఆరోపణలు ఎదుర్కున్న వ్యక్తి మళ్లీ రావడమేంటని కొంతమంది పనికట్టుకుని విమర్శలు చేస్తుంటే.. సినిమా పెద్దల్లో చాలామంది తప్పుడు పనులు చేసినవాళ్లే వున్నారనీ, అందరి కథలూ బైటపెడితే జానీది చాలా చిన్న కథ అని కొందరు సినీ పరిశ్రమ గురించి అన్నీ తెలిసన వారు సమాధానం ఇస్తున్నారు.

## ఫిక్షనల్ క్రైమ్ డ్రామా కాంత




మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ప్రాజెక్ట్ కాంత. సెల్వమణి సెల్వరాజ్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తోంది. రానా కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని నవంబర్ 14న విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది దుల్కర్ సల్మాన్ టీం. కాంతను ముందుగా లక్కీభాస్కర్‌తోపాటు షూట్ చేయాలనుకున్నాం. ఫస్ట్ లుక్ టెస్ట్ పూర్తి చేసినప్పుడు ఇద్దరు డైరెక్టర్లు అక్కడే ఉన్నారు. ఇద్దరు డైరెక్టర్ల టీమ్స్ కూడా రెండు లుక్స్‌లో ఉన్న కామన్ థింగ్‌ను కనుగొనేందుకు ప్రయత్నించాయి. కాంతలో 80స్ పీరియాడిక్ లుక్‌లో మారిపోవాల్సి ఉంటుంది. మీరు ఈ రెండు లుక్స్ కూడా సరిపోల్చుకోవచ్చు. కాంతలో క్లీన్ షేవ్ లుక్‌లో కనిపించాల్సి రావడంతో అది సాధ్యం కాలేదు. కాంత ప్రొడక్షన్స్ పనుల్లో ఆలస్యం కూడా దీనికి ఒక కారణమంటూ చెప్పుకొచ్చాడు దుల్కర్ సల్మాన్. ఇండియన్ యాక్టర్, సినిమాటిక్ సింగర్‌గా పాపులర్ అయిన ఎంకే త్యాగరాజ భగవతార్ ప్రయాణం స్ఫూర్తిగా సాగే ఫిక్షనల్ క్రైం డ్రామా అని అన్నాడు దుల్కర్ సల్మాన్. అంతేకాదు కాంత సాధారణ పీరియాడిక్ డ్రామా కాదని.. మోడ్రన్ సినిమా చూసిన అనుభూతిని ఇస్తుందని చెప్పారు రానా, దుల్కర్ సల్మాన్. ఇప్పటికే కాంత మూవీ నుంచి చేసిన అమ్మాడివే సాంగ్, రేజ్ ఆఫ్ కాంత ట్రాక్ సినిమాలపై హైప్ క్రియేట్ చేస్తున్నాయి. కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.